Follow: @ANNTELUGU
05-01-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 11 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఉత్తరాంధ్ర కల సాకారం.. భోగాపురంలో తొలి విమానం

### కీలక మైలురాయి : సీఎం చంద్రబాబు

**విశాఖ, మహా:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారమైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం తొలి విమానం ల్యాండ్ అయింది. వ్యాలిడేషన్ టెస్ట్ ఫ్లైట్ ఢిల్లీ నుంచి భోగాపురం వచ్చింది. ఈ విమానంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏటీసీ ఛైర్మన్ తదితరులు ఉన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. 96 శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినట్లు జీఎంఆర్ సంస్థ తెలిపింది. జూన్ 26న ఈ ఎయిర్‌పోర్టును ప్రారంభించనున్నారు.

మిగతా 2లో

టాప్ న్యూస్



### వెనిజులా అయిపోయింది

- నెక్స్ట్ మీరే
- కొలంబియా అధ్యక్షుడికి ట్రంప్ వార్నింగ్

02



### ట్రంప్‌లా పాక్ వెళ్ళి

- వారిని ఇండియాకు తీసుకురండి
- మోదీకి ఓవైసీ సవాల్

02

### ఏఐ గ్రోక్ పై కేంద్రం సీరియస్

- మస్క్ కు 72 గంటల గడువు
- అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై సీరియస్

03



### మంత్రి సీతక్కకు కీలక బాధ్యతలు

అప్పగించిన కాంగ్రెస్ హైకమాండ్

వివరాలు 2లో



### 2036 ఒలింపిక్స్ భారత్‌లోనే...

గట్టి ప్రయత్నం చేస్తున్నాం ప్రధాని మోదీ స్పష్టీకరణ

వివరాలు 2లో



### తమిళనాడు, బెంగాల్‌లో ఎన్డీఏ విజయం ఖాయం

కేంద్రహోం అమిత్ షా

**మహా :** త్వరలో తమిళనాడు, బెంగాల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం తమిళనాడులోని పుదుక్కోట్టైలో జరిగిన బీజేపీ ర్యాలీలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. హర్యానాలో వరుసగా మూడోసారి విజయం సాధించామని, ఇప్పుడు తమిళనాడు, బెంగాల్ వంతు వచ్చిందని పేర్కొన్నారు.

## ప్రియాంక సారథ్యంలో.. కాంగ్రెస్ బిగ్ స్కెచ్

- ఐదు రాష్ట్రాలు.. విభిన్న వ్యూహాలు
- బెంగాల్ మినహా నాలుగు రాష్ట్రాల్లో గెలిచేలా ఎత్తుగడలు

**ఢిల్లీ, మహా:** త్వరలో జరగనున్న ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను సీరియస్ గా తీసుకోవాలని కాంగ్రెస్ డిసైడ్ అయింది. గతంలో లాగా కాకుండా.. ఈసారి సరికొత్త ఎత్తుగడలతో ముందుకెళ్ళాలని డిసైడైంది. కాంగ్రెస్ కార్యకర్తలు నయా ఇందిరమ్మగా పిలుచుకునే ప్రియాంక సారథ్యంలో అసెంబ్లీ ఎన్నికల దుమ్ము దులపాలని, బిజెపి జోరుకు బ్రేకులు వేయాలని వ్యూహరచన చేస్తోంది. అసోంలో హిమంతబిశ్వశర్మను గద్దెదించే బాధ్యత తీసుకున్న ప్రియాంక గాంధీ.. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం సరికొత్త ఎత్తుగడలతో ముందుకెళ్తోంది. ప్రియాంకగాంధీ ప్రధాని కావాలని డిమాండ్ చేసిన ఎంపీలను ప్రియాంక ఛైర్మన్ గా ఉన్న అసోం అసెంబ్లీ అభ్యర్థుల సెలక్షన్ కమిటీలో నియమించడం సరికొత్త పరిణామం. బిహార్, హర్యానాలలో దెబ్బతిన్న కాంగ్రెస్ ఇపుడు వ్యూహాలను మార్చుకుంటోంది. ఓట్ చోరీ, రాజ్యాంగ పరిరక్షణ అంశాలకంటే స్థానిక అంశాలపైనే అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడాలని భావిస్తోంది. ఈసారి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకలు ఐదు రాష్ట్రాలపై ప్రత్యేక స్కెచ్ తో

మిగతా 2లో



### ఫిబ్రవరిలో షెడ్యూల్?

కేరళ, బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అసోం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మార్చి-మే మధ్య జరగనున్నాయి. 126 మంది సభ్యులున్న అసోం అసెంబ్లీకి ఈ ఏడాది మార్చి - ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఫిబ్రవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ వచ్చే అవకాశాలున్నాయి.

## నో కాంప్రమైజ్

### ఏపీ ప్రాజెక్టులపై సుప్రీంలో తెలంగాణ జలయుద్ధం

న్యాయనిపుణులతో సీఎం రేవంత్ ప్రత్యేక భేటీ

ముంబైలో అభిషేక్ సింఘ్వీ, లీగల్ టీమ్ తో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ చర్చలు

పోలవరం, నల్లమల్లసాగర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా బలమైన వాదనలు



**హైదరాబాద్, మహా:** నీటిప్రాజెక్టులపై బీఆర్ఎస్ వాదనలు ఎప్పటికపుడు తిప్పికొడుతూ తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు తీవ్ర కృషి చేస్తున్నారు. శనివారం అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ నీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా, సీఎం రేవంత్ రెడ్డి స్పీచ్ కు ప్రశంసలు లభించాయి. ఎందుకు సవాల్ విసిరి పారిపోయారని ఇతర రాజకీయపక్షాలు కూడా బీఆర్ఎస్ తీరును ఎద్దేవా చేశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం, నల్లమల్ల సాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లో వాదనలు జరగనున్నందున తెలంగాణా ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించేందుకు ఆదివారం ముంబైలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి తో సీఎం రేవంత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎం రేవంత్, మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పోలవరం, నల్లమల్ల సాగర్ వల్ల తెలంగాణకు జరిగే నష్టాలను, తెలంగాణ ప్రభుత్వ, ప్రజల అభ్యంతరాలను, భయాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ వీటికి అంగీకరించేదిలేదని, బలమైన వాదనలు వినిపించాలని న్యాయనిపుణులను కోరారు.

### వెనిజులా అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్

- అమెరికా ఆకస్మికదాడితో అంధకారంలో రాజధాని
- వెనిజులా పరిణామాలపై భారతప్రభుత్వం ఆందోళన
- అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే - కాంగ్రెస్

02

## ఉత్తమ్ కట్టుకథలు రేవంత్ పిట్ట కథలు

అసెంబ్లీలో పీపీటీపై హరీష్ విమర్శలు

**హైదరాబాద్,మహా:** సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అన్నీ అబద్ధాలే చెబుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీష్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల అంశంపై ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో పీపీటీ ఇచ్చిన హరీష్ రావు ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా అన్నీ అబద్ధాలే చెబుతున్నారన్నారు. ఉత్తమ్ కట్టుకథలు, రేవంత్ పిట్ట కథలు చెప్పారంటూ విమర్శించారు. రాజకీయాల కోసం తాము పీపీటీ ఇవ్వడం లేదన్నారు. ఫజల్ అలీ కమిషన్ చెప్పినా వినకుండా ఆంధ్రాలో కలిపి.. తెలంగాణకు ద్రోహం చేశారంటూ కాంగ్రెస్ నాయకుల తీరును విమర్శించారు. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పార్టీ అని హరీష్ విమర్శించారు. నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాసింది కూడా కాంగ్రెస్సే అని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలోనూ కాంగ్రెస్ అన్యాయం చేసిందన్నారు.

## ట్యాపింగ్ విచారణలో అసలు ఘట్టం

### విచారణలో ఎమ్మెల్సీ నవీన్ రావు ఉక్కిరిబిక్కిరి

నవీన్ రావుపై గతంలో తీవ్ర ఆరోపణలు

అప్పట్లో సిటీ పోలీసు బదిలీలు..పోస్టింగ్ లు, సెటిల్ మెంట్లు అన్నీ ఆయన కనుసన్నల్లోనే





**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ విచారణలో అసలు ఘట్టం మొదలైంది. ట్యాపింగ్ లో డివైజ్ సమకూర్చడంతో పాటు పేర్లను అధికారులకు ఇచ్చారని, దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ ఆదివారం సుదీర్ఘంగా విచారించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో నవీన్ రావుపై దర్యాప్తు అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఎస్ఐబీ మాజీ అధికారులతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారు. ఇప్పటికే పలువురు రాజకీయ నేతలు, అధికారులు ఇచ్చిన స్టేట్మెంట్ల ఆధారంగా నవీన్ రావు వాంగ్మూలాన్ని సిట్ అధికారులు రికార్డు చేసినట్లు సమాచారం. బీఆర్ఎస్ హయాంలో సిటీ పోలీసుల బదిలీలు, పోస్టింగ్ లు ఇప్పించడం, పోలీసు ద్వారా సెటిల్ మెంట్లు చేసే ప్రక్రియకు నవీన్ రావు

మిగతా 2లో

### అసెంబ్లీ బాయ్ కాట్.. హరీష్ నిర్ణయమా? బీఆర్ఎస్ నిర్ణయమా?

### హరీష్ పార్టీలో ఓ గ్రూప్ తయారు చేస్తున్నారు

- ఆయన ఒక గుంట నక్క.. బీఆర్ఎస్‌ను ఎవరూ కాపాడలేరు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు

02

# ప్రియాంక సారథ్యంలో..
# కాంగ్రెస్ బిగ్ స్కెచ్

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు సాగుతున్నట్లు తాజా సెలక్షన్ కమిటీలతో స్పష్టమైంది.

**కాంగ్రెస్ ఆశలు వీటిపైనే...**

అసోం అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతోంది. అభ్యర్థుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీని ఛైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటుచేశారు. అందులో భాగంగా అసోం, బెంగాల్ , కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి కోసం కమిటీలు ఏర్పాటుచేయగా, ఒక్కో కమిటీలో నలుగురు సభ్యులను నియమించారు. అందులో బాగంగానే ప్రియాంకను కీలక రాష్ట్రానికి ఛైర్ పర్సన్‌గా నియమించారు.

**ఈసారి లెక్క పక్కాగా..**

కాంగ్రెస్ ఈసారి పక్కాగా లెక్కలతో ముందుకెళ్తోంది. గత కొన్నేళ్ళుగా కొరకరాని కొయ్యలా ఉన్న అసోంను ఈసారి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తుపెట్టుకొని బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తోంది. అందుకే చాలా పకడ్బందీగా స్క్రీనింగ్ కమిటీలో ప్రియాంక గాంధీతోపాటు, ఆమె సన్నిహితులైన లోక్ సభ ఎంపీలైన ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలక, సిరివెళ్ల ప్రసాద్‌లను సభ్యులుగా నియమించింది.

కేరళ స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత మధుసూదన్ మిస్త్రీని ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో రాజ్యసభ ఎంపీలు సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి, అభిషేక్ దత్ సభ్యులుగా ఉన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి కమిటీలకు ఛత్తీస్‌గఢ్ మాజీ ఉపముఖ్యమంత్రి టీఎస్ సింగ్ డియో ఛైర్మన్‌గా ఉన్నారు. ఇందులో యశోమతి ఠాకూర్, జి.సి. చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ సభ్యులుగా ఉన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీకి బి.కె. హరిప్రసాద్ నేతృత్వం వహిస్తారు. ఆ కమిటీలో మహమ్మద్ జావేద్, మమతా దేవి, బి.పి.సింగ్‌లు సభ్యులుగా ఉన్నారు. సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు/ఇన్‌ఛార్జ్‌లు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్‌పీ నాయకులు, ఏఐసీసీ కార్యదర్శులు పదవి రీత్యా తమ తమ రాష్ట్రాల స్క్రీనింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

**రాష్ట్రాల్లో పొత్తు వ్యూహాలు**

ప్రస్తుతం అసోంలో బీజేపీ అధికారంలో ఉంది. దాని నుంచి అధికారం చేజిక్కించుకోవడానికి, కాంగ్రెస్, సీపీఐ(ఎం), రైజోర్ దళ్ , అసోం జాతీయ పరిషత్ (ఏజేపీ), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, జాతీయ దళ్ అసోం (జేడీఏ), కర్బీ ఆంగ్లాంగ్‌కు చెందిన ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ (ఏపీహెచ్ఎల్‌సీ) పార్టీలు చేతులు కలిపాయి. ఆ పార్టీలన్నీ కలిసి ఒకే వేదిక నుంచి అసోం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నాయి. అసోం అసెంబ్లీలో మొత్తం 126 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం బీజేపీకి 64 మంది సభ్యులు ఉండగా, దాని మిత్రపక్షాలపై ఏజీపీకి 9, యూపీపీఎల్‌కు 7, బీపీఎఫ్‌కు 3 సభ్యులు ఉన్నారు. ఇక, విపక్ష శిబిరంలో కాంగ్రెస్‌కు 26, ఏఐయూడీఎఫ్‌కు 15, సీపీఐ(ఎం)కు 1 ఎమ్మెల్యే ఉన్నారు. వీరితోపాటు ఒక స్వతంత్ర శాసన సభ్యుడు కూడా అసోం అసెంబ్లీలో ఉన్నాడు. కాంగ్రెస్ అభ్యర్థులను పకడ్బందీగా ఎంపిక చేసుకుని, మిత్రపక్షాలను కరెక్ట్ గా డీల్ చేస్తే అధికారం చేజిక్కించుకోవడం కష్టం కాదన్న అభిప్రాయం ఉంది. అసోంలో కాంగ్రెస్ ఎదురుదెబ్బలు తిన్నా బలంగా ఉంది.

తమిళనాడులో ప్రస్తుతం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే అధికారంలో ఉంది. అక్కడ పాగా వేయడానికి ఓ పక్క బీజేపీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అన్నాడీఎంకేతో పొత్తును బిజెపి కుదుర్చుకుంది. ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత అయిన విజయ్ మాత్రం, కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే కాంగ్రెస్‌కు అది చాలా ప్లస్ పాయింట్ అయ్యే అవకాశం ఉంది. అయితే స్థానిక కాంగ్రెస్ నేతలు కొందరు డీఎంకేతో పొత్తుకు మొగ్గుచూపుతున్నారు. అయితే విజయ్ తో పొత్తుద్వారా కాంగ్రెస్ కు పూర్వవైభవం వస్తుందని, మళ్ళీ పార్టీ విస్తరిస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ అధికారంలో ఉంది. ఇటీవల జరిగిన లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో బీజేపీ కీలక స్థానాల్లో విజయం సాధించి, మంచి ఊపుమీద ఉంది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఇప్పటి నుంచే రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం సన్నద్ధం అవుతోంది. యుడీఎఫ్ కేసీ వేణుగోపాల్ సారథ్యంలో అధికారంలోకి రావడం ఖాయమని అంటున్నారు. బిజెపి ఎల్‌డిఎఫ్, యూడీఎఫ్ లకు భిన్నమైన స్ట్రాటజీలతో ముందుకు వెళ్తోంది.

ప్రస్తుతం పుదుచ్చేరిలో ఎన్ .రంగస్వామికి చెందిన ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీల సంకీర్ణ ప్రభుత్వం ఉంది. అయితే డీఎంకే, కాంగ్రెస్‌ల కూటమి ఇక్కడ చాలా బలమైన ప్రతిపక్షంగా ఉంది. ఈసారి అధికారం చేజిక్కించుకోవాలని ముందు నుంచే వ్యూహాలు రచిస్తోంది.పశ్చిమ బెంగాల్ లో ప్రస్తుతం మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. బీజేపీ ఇక్కడ బలమైన ప్రతిపక్షంగా ఉంది. కాంగ్రెస్ ఇక్కడ బలహీనపడింది. పొత్తులు పెట్టుకుని బలం పెంచుకునే వ్యూహంతో ఉంది. జాతీయస్థాయి రాజకీయాలు ఇక్కడ ప్రభావం చూపనున్నాయి. మొత్తంగా ఐదు రాష్ట్రాలపై సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలు ప్రత్యేక స్కెచ్ రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.

# వెనిజులా అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్

- అమెరికా ఆకస్మికదాడితో అంధకారంలో రాజధాని
- వెనిజులా పరిణామాలపై బారతప్రభుత్వం ఆందోళన
- అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే - కాంగ్రెస్



**మహా :** వెనాజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్ నియమితులయ్యారు. అమెరికా దాడుల నేపథ్యంలో సంక్షోభ పరిస్థితుల నడుమ ప్రభుత్వ పాలనా కొనసాగింపు, దేశ రక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అక్కడి సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. వెనిజులాలో తాజా పరిణామాలు ఆందోళన కలిగించే విషయమని భారత ప్రభుత్వం పేర్కొంది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చింది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా బలగాలు అదుపులోకి తీసుకోవడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ఆదివారం నాడు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "గత 24 గంటల్లో వెనెజువెలాకు సంబంధించి అమెరికా తీసుకున్న చర్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. సుస్థిరమైన అంతర్జాతీయ చట్టాలను ఏకపక్షంగా ఉల్లంఘించలేరు" అని పేర్కొన్నారు.

**మెరుపుదాడులతో అంధకారం**

వెనిజులాపై అమెరికా జరిపిన ఆకస్మిక మెరుపు దాడులతో ఆ దేశం అంధకారంలోకి జారుకుంది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా జరిగిన ఈ దాడుల్లో కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్ గ్రిడ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో దేశ రాజధాని కారకాస్‌తో పాటు అనేక నగరాలు, పట్టణాలు అంధకారంలో చిక్కుకున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఆహారం, తాగునీరు, మందులు వంటి నిత్యావసరాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దాడుల తదనంతర పరిణామాలను, అక్కడి ప్రజల దయనీయ స్థితిని కారకాస్‌లో నివసిస్తున్న పలువురు భారతీయులు మీడియాకు వివరించారు. "అమెరికా దాడులతో భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. కరెంటు లేకపోవడంతో కారకాస్‌లోని అన్ని ప్రధాన సూపర్ మార్కెట్లు, పెద్ద దుకాణాలు మూతపడ్డాయి. కేవలం కొన్ని చిన్న దుకాణాలు మాత్రమే తెరిచి ఉన్నాయి. వాటి ముందు నిత్యావసరాల కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. ఒక్కో దుకాణం ముందు 500 నుంచి 600 మంది వరకు పొడవైన క్యూలలో గంటల తరబడి నిలబడుతున్నారు. మందుల కోసం ఫార్మసీల వద్ద కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది" అని ఆయన వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా జంకుతున్నారని, దీంతో నగరంలోని చాలా ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "కారకాస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై దాడి జరిగింది. నగరానికి సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశంలోనే అతిపెద్ద వైమానిక స్థావరం కూడా ధ్వంసమైంది. ముఖ్యంగా, ఫోర్ట్ ట్యూనా మిలిటరీ స్థావరంపై జరిగిన దాడిలో ఎక్కువ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. కరెంటు సరఫరా లేకపోవడంతో ఆధునిక జీవన విధానంలో అత్యంత కీలకమైన మొబైల్ ఫోన్ల వాడకం కష్టతరంగా మారింది. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో ప్రజలు తమ ఆత్మీయులతో మాట్లాడటానికి, సమాచారం తెలుసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఫోన్లు ఛార్జ్ చేసుకునేందుకు ప్రజలు పడుతున్న పాట్లు అక్కడి దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రోడ్లపై అడపాదడపా వెలుగుతున్న కొన్ని సోలార్ విద్యుత్ దీపాల కిందకు చేరి ప్రజలు తమ ఫోన్లకు ఛార్జింగ్ పెట్టుకుంటున్నారు.

# అసెంబ్లీ బాయ్ కాట్ హరీష్ నిర్ణయమా?
# బీఆర్ఎస్ పార్టీ నిర్ణయమా?

- హరీష్ పార్టీలో ఓ గ్రూప్ తయారుచేస్తున్నారు
- ఆయన ఒక 'గుంట నక్క'.. బీఆర్ఎస్‌ను ఎవరూ కాపాడలేరు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్, మహా :** అసెంబ్లీ సమావేశాలు బాయ్ కాట్ చేయడం హరీష్ నిర్ణయమా? బీఆర్ఎస్ పార్టీ నిర్ణయమా? తనను ఒక్క మాట అన్నందుకే అసెంబ్లీని బాయ్ కాట్ చేసిన హరీష్ కేసీఆర్ పై అంత తీవ్ర వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ నుండి ఎవరూ ఎందుకు స్పందించలేదంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. పాలమూరురంగారెడ్డి, నారాయణ్‌పేట్ కొడంగల్‌కు 77.5 టీఎంసీలు కేటాయిస్తే, 40 టీఎంసీలకే ఎందుకు అంగీకరించారని కవిత ప్రశ్నించారు. పాలమూరు ప్రజలకు రేవంత్‌రెడ్డి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. హరీశ్‌రావును తిడితే సభను వాయిదా వేసుకొని వెళ్లిపోవటం బీఆర్ ఎస్ డ్రామా అని ధ్వజమెత్తారు. బీఆర్ ఎస్ బాయ్ కాట్ హరీశ్‌రావు నిర్ణయమా? బీఆర్ఎస్ పెద్దల నిర్ణయమా అని గట్టిగా ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ నిర్ణయమైతే చరిత్రలో క్షమించరాని తప్పు చేసినట్లేనని చెప్పారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వదిలి బయట సభలు పెట్టి ప్రజలకు ఏమి వివరిస్తారని విమర్శించారు. తెలంగాణకు 3 శాతం నీళ్ల వాటా తగ్గించే ఒప్పందంపై హరీశ్ రావు సంతకం చేశారా? లేదా అని అడిగారు. గతంలో కేసీఆర్ ని రేవంత్ రెడ్డి ఎన్ని తిట్లు తిట్టలేదు? అప్పుడు ఎందుకు బాయ్‌కాట్ చేయలేదు? ఇప్పుడు హరీష్ రావుకు ఒక పదవి రాగానే ఇలా ప్రవర్తిస్తారా?" అని ఆమె నిలదీశారు. హరీష్‌రావు ఒక 'గుంట నక్క అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "హరీష్‌రావుకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి ఇచ్చినప్పుడే చెప్పాను.. ఇకపై బీఆర్ఎస్ పార్టీని ఎవరూ కాపాడలేరని. కేసీఆర్ గారు సభకు వచ్చి సమాధానం చెప్పకపోతే పార్టీ మనుగడ కష్టమవుతుంది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**కేసీఆర్‌ను అవమానిస్తే నేను రియాక్ట్ అయ్యా**

అలాగే జూరాల నుంచి శ్రీశైలంకు ఇన్ టేక్ పాయింట్‌ను ఎందుకు మార్చారో సమాధానం చెప్పాలని కల్వకుంట్ల కవిత కోరారు. కేసీఆర్‌ను టెర్రరిస్ట్‌తో పోల్చితే నేనే రియాక్ట్ అయ్యాను, బీఆర్ ఎస్ నుంచి ఎవరూ ఎందుకు స్పందించలేదన్నారు. సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి అనుచరులు ఆలయాలను, చెరువులను కూడా వదలలేదని ఆరోపించారు. అడ్డగోలుగా అవినీతి చేసిన వారిపై నేను మాట్లాడుతూనే ఉంటానని హెచ్చరించారు.

వెనిజులా అయిపోయింది
# నెక్స్ట్ మీరే
**కొలంబియా అధ్యక్షుడికి ట్రంప్ వార్నింగ్**

**మహా :** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికన్ సైన్యం నిర్బంధించి అమెరికాకు తరలించిన నేపథ్యంలో, యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో దేశాధినేతకు తీవ్ర హెచ్చరికలు పంపారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో కూడా కొకైన్‌ను తయారు చేయించి అమెరికాకు అక్రమ రవాణా చేయిస్తున్నారని ఆరోపించారు. మదురో అరెస్టును లాటిన్ అమెరికా సార్వభౌమత్వంపై దాడి అని, వాషింగ్టన్ చర్యల వల్ల మానవతా సంక్షోభం సంభవిస్తుందని కొలంబియా అధ్యక్షుడు పెట్రో ఆరోపించటంతో ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. కొలంబియా డ్రగ్స్ ఉత్పత్తుల ల్యాబ్‌లపై దాడులు చేస్తామని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. పశ్చిమార్ధగోళంలో తమ ఆధిపత్యమే ఉంటుందని తేల్చిచెప్పారు. చుట్టుపక్కల దేశాలన్నీ తమతో సఖ్యతగా ఉండాలని, అవి స్థిరత్వంతో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. మెక్సికో విషయంలోనూ ఏదో ఒకటి చేయనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు.

# ఉత్తరాంధ్ర కల సాకారం..
# భోగాపురంలో తొలి విమానం




(మొదటిపేజీ తరువాయి)

2015లో ఈ విమానాశ్రయానికి చంద్రబాబు పట్టుదల, ముందుచూపుతో శ్రీకారం చుట్టగా, ఇపుడు రెండోసారి ప్రభుత్వం రాగానే త్వరితగతిన పూర్తవుతోంది.

**చంద్రబాబు హర్షం**

భోగాపురంలో తొలి విమానం ల్యాండ్ కావడం ఎయిర్‌పోర్ట్ చరిత్రలో కీలక మైలురాయి అని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఆదివారం భోగాపురం ఎయిర్ పోర్ట్‌లో తొలి విమానం ల్యాండ్ కావడంపై సీఎం చంద్రబాబు నాయుడు.. తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఏపీ విమానయాన రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం నమోదైందన్నారు. వ్యాలిడేషన్ ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రాంతీయ అనుసంధానం (కనెక్టివిటీ) బలోపేతం అవుతుందని.. ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి భారీగా ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు మద్దతు అందించిన ప్రధాని మోదీకి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ప్రజల సేవలకు విమానాశ్రయం సిద్ధమవుతోందని చెప్పారు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ ఎయిర్ పోర్ట్ ద్వారా వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ ఎయిర్ పోర్ట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యం కంటే ముందే భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తికానుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.




# ట్రంప్ లా పాక్ వెళ్ళి వారిని ఇండియాకు తీసుకురండి
**మోదీకి ఓవైసీ సవాల్**

**ముంబై:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక చర్యతో వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించి యూఎస్ తీసుకువెళ్లినట్టే 26 /11 ముంబై దాడి ప్రధాన సూత్రధారులను కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్థాన్ నుంచి ఇండియాకు తీసుకురావాలని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మదురోను ట్రంప్ పట్టుకుని స్వదేశానికి తీసుకువెళ్లినప్పుడు 170 మంది ప్రాణాలను బలిగొన్న 2008 ఉగ్రదాడుల నిందితులైన మసూద్ అజహర్, లష్కరే తొయిబా నేతలను కూడా మోదీ పట్టుకురావచ్చు కదా అని ఒవైసీ అన్నారు.

# ట్యాపింగ్ విచారణలో
# అసలు ఘట్టం





(మొదటిపేజీ తరువాయి)

ఇన్ ఛార్జిగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

**మళ్ళీ అదే చెప్పా- ఎమ్మెల్సీ నవీన్ రావు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. '2024 సెప్టెంబర్‌లో పిలిస్తే విచారణకు హాజరయ్యాను.. అప్పుడు దాదాపు 3 గంటలు విచారించారు. ఇప్పుడు కూడా అదే విషయంలో పిలిస్తే విచారణకు వచ్చాను. విచారణ పూర్తిగా సహకరించాను. బయట ప్రచారం అవుతున్నట్టు ఎలాంటి మెటీరియల్ సరఫరా గురించి విచారణలో చర్చకు రాలేదు. నేతలు, వ్యక్తులతో సంబంధాల గురించి అడిగారు. సంబంధించిన పూర్తి వివరాలు చెప్పాను. సెప్టెంబర్ 24న ఏదైతే చెప్పానో.. ఇపుడు కూడా అదే చెప్పాను. అవే విషయాలు అడిగారు. నేను పరికరాలు సమకూర్చాననే విషయం చర్చకు రాలేదు' అని నవీన్ రావు స్పష్టం చేశారు. కాగా, ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక పరికరాలులు ఉపయోగించి.. అప్పటి ప్రతిపక్షనేతలు, వారి కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించారంటూ నవీన్ రావుపై ఆరోపణలు ఉన్నాయి.

**బీఆర్ఎస్ ముఖ్యనేతలకు చిక్కులు**


డిసెంబర్ లో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును సిట్ విచారించింది. ఈ విచారణకు సంబంధించి జనవరి 16వ తేదీన సిట్ సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించనుంది. అయితే ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు రాబోతున్నాయని ఆయనను సిట్ ప్రశ్నించబోతోందని ప్రచారం జరిగింది. మీడియా యాజమాని శ్రవణ్ రావు ద్వారా ఆపరేషన్ చేశారన్న ఆరోపణలపై నోటీసులు రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో హరీశ్‌ను ప్రతివాదిగా చేరుస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అసెంబ్లీ తర్వాత హరీష్ రావుకు నోటీసులు రాబోతున్నాయని ప్రచారం జరగ్గా, నోటీసులొస్తాయా అంతా వట్టి ప్రచారమేనా అన్నది రానున్నరోజుల్లో తెలుస్తుంది.



# మంత్రి సీతక్కకు కీలక బాధ్యతలు
**అప్పగించిన కాంగ్రెస్ హైకమాండ్**

**హైదరాబాద్, మహా :** మంత్రి సీతక్కకు కాంగ్రెస్ హైకమాండ్ కీలక బాధ్యతలు అప్పగించింది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వీబీజీరాంజీ చట్టాన్ని రద్దుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 25వరకు దేశవ్యాప్తంగా 'ఎంజీనరేగా బచావో సంగ్రాం' ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఏఐసీసీ అధిష్ఠానం 9 మంది సభ్యులతో జాతీయస్థాయిలో సమన్వయ కమిటీని ఏర్పాటుచేసింది. సీనియర్ నేత అజయ్ మాకెన్ సమన్వయకర్తగా వ్యవహరించే ఈ కమిటీలో సభ్యురాలిగా తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క నియమితులయ్యారు. మాజీ కేంద్రమంత్రి జైరాంరమేష్, మాజీ ఎంపీలు సందీప్ దీక్షిత్, ఉదిత్‌రాజ్, కర్ణాటకమంత్రి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కుమారుడు ప్రియాంక్‌ఖర్గే, ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దీపికా పాండేసింగ్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఛైర్‌పర్సన్ సునీల్‌పన్వర్, యూత్‌కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మనీష్‌శర్మలు ఇందులో సభ్యులుగా నియమితులయ్యారు. కీలక నేతలున్న కమిటీలో సీతక్కకు స్థానం కల్పించడంపై రాష్ట్రకాంగ్రెస్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# హైదరాబాద్‌లో చంద్రబాబు
టీడీపీ నేత సాయిబాబా కుటుంబానికి బాబు పరామర్శ
పార్టీ ఆవిర్భావం నుండి ఆఖరిశ్వాస వరకు పార్టీతోనే



**హైదరాబాద్, మహా :** సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా మృతితో ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధ కలిగిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్టీ ఆఫీస్‌కు ఎప్పుడు వెళ్లినా.. తనకు ఆయన స్వాగతం పలికేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ కోసమే ఆయన పని చేశారని వివరించారు. ఆదివారం హైదరాబాద్‌లో పిన్నమనేని సాయిబాబా కుటుంబాన్ని సీఎం చంద్రబాబు పరామర్శించారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ఆయన తన కుటుంబం కోసం కాకుండా పార్టీ కోసం పని చేసిన వ్యక్తి సాయిబాబా అని గుర్తు చేసుకున్నారు. సాయిబాబా కుటుంబానికి కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ కుటుంబాన్ని నిలబెట్టే బాధ్యత.. పార్టీ అధినేతగా ఆ కుటుంబ పెద్దగా తాను తీసుకుంటానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సాయిబాబా కుటుంబానికి ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం తనకు చాలా బాధ కలిగిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి శనివారం వరకు .. చివరి శ్వాస ఉన్నంత వరకు పార్టీ కోసం పని చేసిన వ్యక్తి పిన్నమనేని సాయిబాబా అని వివరించారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు.. ఆయన అభిమానిగా పార్టీలో చేరడం.. నాటి నుంచి అనునిత్యం పార్టీ కోసం పని చేశారని గుర్తు చేసుకున్నారు. పార్టీ కోసం పిన్నమనేని సాయిబాబు ఎనలేని సేవలు అందించారన్నారు. చివరి రోజుల్లో నడవ లేని పరిస్థితుల్లో వీల్ చైర్‌లో వచ్చి పార్టీ ఆఫీస్‌లో కూర్చొనే వారన్నారు. పార్టీ కోసం ఒక కమిట్ మెంట్‌తో పని చేసిన వ్యక్తి పిన్నమనేని సాయిబాబా అని చెప్పారు.



# 2036 ఒలింపిక్స్ భారత్‌లోనే
**గట్టి ప్రయత్నం చేస్తున్నాం**
**ప్రధాని మోదీ స్పష్టీకరణ**

**వారణాసి:** భారతదేశం క్రీడా రంగంలో సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన.. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు.

# కని విని ఎరుగని రీతిలో మేడారం జాతర నిర్వహణ

**200 ఏళ్ళు చెక్కు చెదరకుండా పునరుద్ధరణ పనులు.. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతోనే సాకారమవుతున్న అద్భుతం.. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**







**మహా:** ఆదివాసీ బీజాల సుందర శిల్పాలతో మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణం గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు శాశ్వత చిరునామగా నిలుస్తుందని, చరిత్రలో కనీ విని ఎరుగని రీతిలో ప్రజా ప్రభుత్వం మేడారం జాతరను నిర్వహించడానికి సంకల్పించుకుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ములుగు జిల్లా . తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయంనకు హెలికాప్టర్ లో చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ లతో కలిసి ఆలయ ప్రాంగణ ల్యాండ్ స్కేపింగ్ పనులను, ప్రధాన ఆర్చి నిర్మాణ పనులు, హరిత హోటల్ జంక్షన్ సుందరీకరణ, రహదారి నిర్మాణ పనులను, జంపన్న వాగు స్నాన ఘట్టాలను, లెవెలింగ్ పనులను , నీటి నిల్వ కోసం ఏర్పాటు చేస్తున్న ఆనకట్టల నిర్మాణ పనులను పరిశీలించారు. జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి బ్యాంబు చికెన్ క్యాంటీన్ ను మంత్రి పొంగులేటి




శ్రీనివాస రెడ్డి, మంత్రి దనసరి అనసూయ సీతక్క, కలెక్టర్ దివాకర టి.ఎస్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రులు ఎం పి బలరాం నాయక్ తో కలిసి మేడారంలోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులతో, గుత్తేదారులతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

### జనవరి 12 కల్లా పూర్తిచేయండి

ఆలయ ప్రాకారం పిటి బీమ్స్ అమరిక పనులను, గద్దెల రాతి స్తంభాలపై బ్రాకెట్ లను త్వరిత గతిన ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణ మరియు జాతర సివిల్ వర్క్స్, క్యూ లైన్స్ షెడ్స్ నిర్మాణం మొత్తం జనవరి 12వ తేది వరకు పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. నూతనంగా నిర్మించిన రహదారులకు ఇరువైపులా సైడ్ బర్మలను ఏర్పాటు చేయాలని పబ్లిక్ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి చూస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మేడారం జాతర చుట్టూ ప్రక్కల ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య రాకుండా బోర్ వెల్స్ చేతి పంపులు ఏర్పాటు చేయాలని, మేడారం ప్రాంతం సంక్రాంతి పండుగ ముందు నుంచి జనవరి 31 వరకు విద్యుత్ కాంతుల వెలుగులతో భక్తులకు కనిపించాలని వాటికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబధిత అధికారులకు సూచించారు. జాతర పరిసరాలను జోన్స్, సెక్టార్స్ వారిగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొని పారిశుధ్య పనులను చేపట్టాలని , పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులు ఐనా గుత్తేదారులకు ఐనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీలోగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకరోజు ముందే ఇక్కడికి వచ్చి రాత్రి బస చేసి తెల్లవారి ఉదయం ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయిన సందర్భంగా ప్రారంభించుకునే కార్యక్రమం చేపట్టబోతున్నాం అని తెలిపారు. సమ్మక్క సారలమ్మ భక్తులు సంతోషపడే విధంగా శుభవార్తగా ఈ విషయాన్ని తెలియజేస్తున్నాను. ఈ సంవత్సరం జాతరను పురస్కరించుకొని ప్రతి జాతరకు వచ్చే దాని కంటే కూడా తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని రాష్ట్రాలకు చెందిన కోట్లాదిమంది భక్తులు సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేస్తున్నారని, దానికి తగ్గట్టుగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

### సీఎం ఆదేశాలతో

సమ్మక్క సారలమ్మ జాతరలో మౌలిక వసతులతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఇక్కడే ఉండి పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నారు. అమ్మవార్ల దయతో ఆలయ పునరుద్ధరణ పనుల కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఛాలెంజ్ గా తీసుకొని చేపట్టిందని, తక్కువ సమయంలో రాతితో 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాం అని స్పష్టం చేశారు.







## ఏఐ గ్రోక్ పై కేంద్రం సీరియస్

- మస్క్ కు 72 గంటల గడువు
- అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై సీరియస్

**మహా:** ఎలన్ మస్క్ కు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' కు భారత ప్రభుత్వం స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఎక్స్‌కు చెందిన ఏఐ టూల్ 'గ్రోక్' ద్వారా అశ్లీల, అసభ్యకర కంటెంట్ సృష్టి, వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించింది. దీనిపై 72 గంటల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని స్పష్టం చేసింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'గ్రోక్' లేదా ఎక్స్‌ఏఐకి చెందిన ఇతర సర్వీసులను దుర్వినియోగం చేసి అశ్లీల, నగ్న, అసభ్యకరమైన కంటెంట్‌ను హోస్ట్ చేయడం, ప్రచురించడం, షేర్ చేయడం వంటివి జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ నోటీసులో పేర్కొంది. కేంద్రం ఆదేశాలపై ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ కార్ప్' ఆదివారం స్పందించింది. తమ ప్లాట్‌ఫామ్‌పై చట్టవిరుద్ధమైన కంటెంట్‌కు, ముఖ్యంగా చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటూనే ఉన్నామని తెలిపింది. అవసరమైతే స్థానిక ప్రభుత్వాలు, చట్ట అమలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని 'ఎక్స్ సేఫ్టీ' విభాగం వెల్లడించింది. చట్టవిరుద్ధ కంటెంట్ కోసం 'గ్రోక్'ను వాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని మస్క్ చేసిన పోస్టుకు 'ఎక్స్ సేఫ్టీ' బదులిచ్చింది. నిబంధనలు పాటించని పక్షంలో ఐటీ చట్టం,బీఎన్‌ఎస్, ఇతర చట్టాల ప్రకారం తీవ్రమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్రం హెచ్చరించింది.



## ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** ఓటరు జాబితాల్లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వార్డుకు సంబంధించిన ఓటర్ల వివరాలు కీలకమని, ఎన్నికల నిర్వహణకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఆదివారం భువనగిరి, ఆలేరు, యాదగిరి గుట్ట మున్సిపాలిటీ లను అదనపు కలెక్టర్ సందర్శించి 2వసాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా కార్యాలయంకు విచ్చేసి, డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు ను పరిశీలించారు, డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఏమైనా మార్పులు చేర్పుల కొరకు ఫిర్యాదులు అందితే వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రజలకు ఎవ్వరికైననూ ఎటువంటి అభ్యంతరములు మరియు ఫిర్యాదులు ఉన్న యెడల అట్టి అర్జీలను స్వీకరించుటకు గాను కార్యాలయములో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కౌంటర్ ను సందర్శించి వివరములు అడిగి తెలుసుకున్నారు. ఈ విధముగా వచ్చినటువంటి అభ్యంతరములను ఏరోజుకారోజు విచారణ నిర్వహించి పరిష్కరించగలరని సంబంధిత అధికారులను ఆదేశించడమైనది. రాబోయే ఎన్నికలకు కూడా యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని అన్నింటిని ముందస్తుగా సమకూర్చుకోగలరని దిశానిర్దేశం చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్, మేనేజర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మావోల హిట్‌లిస్ట్ లో తెలంగాణ కాంగ్రెస్ నేత

**వదిలిపెట్టబోమని హెచ్చరిక**

హిడ్మాను వైద్యం పేరుతో నమ్మించి శత్రువులకు పట్టించారని వెల్లడి

చర్లకు చెందిన ఓ కాంగ్రెస్ కీలక నేత, ఒక కాంట్రాక్టర్ ఈ కుట్రలో భాగస్వాములుగా గుర్తించామని ప్రకటన

కుట్రకు సంబంధించిన వాయిస్ రికార్డులు, ఇతర ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్న పార్టీ

మోసం చేసిన వారిని వదిలిపెట్టబోమని, ఇప్పటికే ఒక కాంట్రాక్టర్‌ను అంతమొందించామని హెచ్చరిక



**హైదరాబాద్, మహా:** మావోయిస్టు పార్టీ అగ్రనేత మాద్వి హిడ్మా మృతి వెనుక ఉన్న కుట్రదారులను తాము గుర్తించినట్టు ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామ రాజు డివిజన్ కమిటీ శుక్రవారం 'విప్లవ' పేరుతో ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, రాజితో పాటు మరికొంత మంది సభ్యులకు వైద్యం చేయిస్తానని నమ్మించి, ఒక కాంట్రాక్టర్ తమను మోసం చేశాడని మావోయిస్టులు ఆరోపించారు. ఈ కుట్రలో భద్రాద్రి జిల్లా చర్ల ప్రాంతానికి చెందిన ఒక ముఖ్య కాంగ్రెస్ నాయకుడి పాత్ర కీలకమని పార్టీ లేఖలో పేర్కొంది. గతంలో తాము క్షమాభిక్ష పెట్టిన సదరు నాయకుడే కొండవాయి మార్గంలో కారును ఏర్పాటు చేసి మావోయిస్టులను ఆంధ్ర ప్రాంతానికి తరలించారని, అక్కడ వారిని శత్రువులకు చిక్కేలా చేశారని వివరించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వాయిస్ రికార్డులు, పక్కా ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పార్టీ స్పష్టం చేసింది. పార్టీని మోసం చేసిన వారిని వదిలిపెట్టబోమని ఈ సందర్భంగా మావోయిస్టులు హెచ్చరించారు. ఇటీవల పార్టీకి ద్రోహం చేసిన ఒక కాంట్రాక్టర్‌ను ఇప్పటికే అంతమొందించామని గుర్తు చేస్తూ, తమ నిఘాలో మరికొంత మంది కాంట్రాక్టర్లు ఉన్నారని లేఖలో హెచ్చరించారు. వైద్యం కోసం వెళ్లిన అగ్రనేతలను శత్రువులకు పట్టించడం వెనుక భారీ కుట్ర జరిగిందని మావోయిస్టు పార్టీ ఈ లేఖ ద్వారా నొక్కి చెప్పింది.

## తెలంగాణను ముంచుతున్న జలద్రోహి రేవంత్

**హైదరాబాద్, మహా :** బేసిన్లు తెలియని, నీళ్ల బేసిక్స్ తెలియని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ముమ్మాటికీ తెలంగాణ జలద్రోహి అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. నాటి నుంచి నేటి వరకు తరతరాలుగా తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కాంగ్రెస్సేనని మండిపడ్డారు. నదీజలాలపై చర్చ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పి సభను, తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ తరఫున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారమదంతో విర్రవీగుతూ బలుపుమాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రైతుబంధువు, తెలంగాణ బతుకును కోరిన త్యాగధనుడు కేసీఆర్‌ను అనరాని మాటలనడం బాధాకరమని వాపోయారు. కరువు నేలల్లో సిరులు పండించి, మరణ మృదంగాలు మోగిన నేలలో జీవకళను తెచ్చిన గొప్ప పాలనాదక్షుడు కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి మహానేతపై రేవంత్‌రెడ్డి చిల్లర మాటలతో రెచ్చిపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై దుర్భాషలాడితే హృదయం రగిలిపోతున్నదని పేర్కొన్నారు. 55 ఏండ్ల కాంగ్రెస్, 17 ఏండ్ల చంద్రబాబు పాలనలోనే తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని స్పష్టంచేశారు. అల్పబుద్ధి కలిగిన రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ విలవిలలాడుతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల పాలనలో తెలంగాణ బతుకు చిత్రాన్ని మార్చిన కేసీఆర్, నీళ్ల మంత్రిగా ప్రాజెక్టుల నిర్మాణంలో పాలుపంచుకున్న హరీశ్‌రావును ఉరితీయాలని రేవంత్ మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'అసలు ఉరి వేయాల్సి వస్తే మాట తప్పిన కాంగ్రెస్‌కు ఎన్నిసార్లు వేయాలి? తెలంగాణ ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన పార్టీకి ఏ శిక్ష వేయాలి?' అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు. అశోక్‌నగర్‌కు వచ్చి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండు లక్షల ఉద్యోగాలిస్తామని మోసం చేసినందుకు, వరంగల్ డిక్లరేషన్ సాక్షిగా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పినందుకు, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని దగా చేసినందుకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ద్రోహం చేసినందుకు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి ఉరివేయాలి'అని తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. అసెంబ్లీలో జరిగిన నదీజలాల చర్చలో నీళ్లపై బేసిక్స్ తెలియని, దేవాదుల ఏ బేసిన్లో ఉన్నదో తెలియని, ఇరిగేషన్‌పై అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడటం తీవ్ర



ఆక్షేపణీయమని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి బచావత్, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు, ఐఐటీ, ఐఐఐటీ, ఐటీఐకి తేడాతెలియదని, తెలిసిందల్లా దోచుకోవడం, దాచుకోవడమేనని దెప్పిపొడిచారు.

### రేవంత్‌రెడ్డిది అట్టర్‌ఫ్లాప్ ప్రభుత్వం

ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్‌ది అట్టర్‌ఫ్లాప్ సర్కారు అని, సర్వభ్రష్ట ప్రభుత్వానికి రేవంత్‌రెడ్డి అధినాయకుడిగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవాచేశారు. తెలంగాణలో సర్వత్రా విఫలమైన పాలన నడుస్తున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఏనాడూ తెలంగాణ కోసం కొట్లాడలేదని, మాట్లాడలేదని గుర్తుచేశారు. ఉద్యమకారులపై దాడులకు దిగిన దుర్మార్గుడని మండిపడ్డారు. 'మేమందరం తెలంగాణ సాధన కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న సమయంలో రేవంత్‌రెడ్డి సమైక్యవాదుల సంచులు మోస్తూ, వాళ్ల బూట్లకు పాలిష్ చేసిండు' అని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కురచబుద్ధి, కుట్రపూరిత విధానాలతో తెలంగాణ ప్రజలకు తీరని వేదనను మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సుసంపన్నమైన తెలంగాణ రాష్ట్రం నీచపు మనస్తత్వం కలిగిన వ్యక్తి పాలనలో ఆగమవుతుంటే కడుపు తరుక్కుపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. నందమూరి చెప్పినట్టు అంగుష్ట మాత్రులు అనే పదానికి, ఆ మాటకు ఈ మూర్ఖపు ముఖ్యమంత్రి ముమ్మాటికీ అర్హుడని చురకలంటించారు. నాడు కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలు అక్షరసత్యమని గుర్తుచేశారు.

### నాలుగు భాషల్లో తిట్టే శక్తి ఉన్నది

రాజకీయాల్లో ఉన్నప్పుడు విలువలు ముఖ్యమని, కానీ రేవంత్‌రెడ్డికి ఇవేవీ తెలియదని కేటీఆర్ విమర్శించారు. 'అసెంబ్లీసాక్షిగా కేసీఆర్, హరీశ్, నాపై రేవంత్‌రెడ్డి తిట్లదండకం అందుకోవడం, బూతులు మాట్లాడటం దురదృష్టకరం. మేం రేవంత్‌రెడ్డిలా తిట్టాలనుకుంటే తిట్టగలం..అవసరమైతే ముఖ్యమంత్రి తాతల తాతలను కూడా తూలనాడే శక్తి కలిగి ఉన్నోళ్లం. నాలుగు భాషల్లో అనర్గళంగా దూషించగలం. కానీ కేసీఆర్ నేర్పిన సంస్కారమే ముఖ్యమని భావిస్తున్నం. అందుకే మిన్నకుంటున్నం' అని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డి ఒక అజ్ఞాని, ఉష్ట్రపక్షి అని నిప్పులు చెరిగారు.

## జెలిటిన్ స్టిక్ పేలి జింక మృతి

**ముద్విన్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఘటన**

**హైదరాబాద్, మహా:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని చరికొండ గ్రామపంచాయతీ బోయినగుట్ట తండా వంకరరాయి అడవుల్లో జెలిటీన్ స్టిక్ పేలి జింక మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందుల కోసం జిలిటిన్ స్టిక్కులు అమర్చారు. ప్రమాదవశాత్తు జింక దానిని తినబోయి పేలి చనిపోయి ఉంటుందని సమీప ప్రజలు అనుమానం వ్యక్త పరుస్తున్నారు. గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం తెలుపడంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తదుపరి మృత జింక ను కడ్తాల్ పశువుల ఆసుపత్రికి తీసుకువచ్చి పోస్టుమార్టం నిర్వహించారు ఈ దుర్ఘటనకు పాల్పడిన వారిని గుర్తించేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉసేన్ తెలిపారు.

## గొర్రెలు, మేకల రక్తం సేకరిస్తున్న మూటను పట్టుకున్న కీసర పోలీసులు

పోలీసుల అదుపులో నిందితులు

నిందితులను విచారిస్తున్న పోలీసులు

**మేడ్చల్,మహా :** నాగారం సత్యనారాయణ కాలనీలో రహస్యంగా మేకలు,గొర్రెల మూగ జీవాల రక్తం సేకరిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కీసర పీఎస్ పరిధి సత్యనారాయణ కాలనీలో ఘటన చోటుచేసుకుంది. మటన్ షాప్‌లో రక్తం సేకరించి బయటకు తరలిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. మటన్ షాప్ యాజమానితో పాటు నకిలీ వెటర్నరీ డాక్టర్ అరెస్ట్ చేశారు.180 రక్తం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం, ఈ రక్తంతో ప్లేట్ లెట్స్ తో పాటు కొన్ని వ్యాధులను నయం చేసేందుకు ఉపయోగిస్తారని ముఖ్య సమాచారం.అడ్డగోలుగా మేకలు, గొర్రెల నుండి రక్తం సేకరించడం వల్ల అవి ఒక రోజు తర్వాత చనిపోతాయని ఇది చట్ట విరుద్ధమైన చర్యగా పలువురు చెబుతున్నారు.

# జేబులో సీతాకోక చిలుకల్లా నోట్లుండేవి

నిజానికి వాళ్లు
దూరంనుండే మనల్ని గుర్తు పడతారు

కానీ, చితికి పోయిన మన స్థితిని చూసి
పక్కనుండే అపరిచితుల్లా వెళ్లిపోతారు

నా వద్దకూడా ఒకప్పుడు
ట్రాన్సపరెంట్, నైలాన్ జేబులోంచి కనిపించే,
సీతాకోక చిలుకల్లా నోట్లుండేవి

అన్నిరోజులు ఒకలాగే వుండవు

కొన్నిరోజులు వెలిగే వెన్నెల
కొంతకాలం చిక్కుపడిన చీకటి

ఈ రహస్యం తెలుస్తేనే జీవితం
మనుషులను కలిస్తేనే ప్రయాణం

ఒకప్పుడు కలలో తిరిగిన
మాయా వీధుల ఆనందం తిరిగిరాదు

మడతలు పడి మాయమయ్యే
అలల నీడల సమయం తిరిగిరాదు

ప్రవాహంలో కొట్టుకుపోయే
వయసు తిరిగిరాదు

నీ ముందు మనుషుల గుంపు



- ఆశారాజు,
93923 02245

వెళుతోంది
వాళ్లను పిలువనన్నా పిలువు,
లేదా
నీవు వెళ్లి వాళ్లల్లో, కలవనన్నా కలువు

# నది పారిన జాడలు రెండు

యీ నదిపక్కనుంటే తనువున్నట్టే
మాట మాటికీ నా మాటకు పోటేసి, పొడుపేసి
ఎండ తగిలి చిటుక్కున పగిలిన కాసరకాయ మాదిరి
ఎప్పుడూ తను మాటాడినట్టే ...
పట్టుజారిన రాతి గట్టు అంచున ఎర్రని మర్రి పండ్లు
నిండుగా పండినట్టే ...

రాకాసి దిగులుపొదలు కమ్మినపుడో
కాటుక గొయ్యారంలో దిక్కుతోచనపుడో...
అంటే రోజూనూ...
నది వెంటే నడుస్తాను మాటలు వింటూ
అది భలే చలాకీ
వొక్క వెలుతురు తీవె దొరికెనా...
వొడిసి పట్టి
దరికి దారులు వేయడం నేర్పుతుంది

నది నా వ్యసనం
అప్పుడే కప్పిన యే సమాధిపైనో
చినుకు పువ్వులు రాలి
మట్టి వాసనై వీచిన
వొక జీవితం కావచ్చు
అసహజంగానో అర్థాంతరంగానో
పుట్టిమునిగి నీటిపుట్టలో కరిగిన
సహచరితమూ కావచ్చు
ఏది ఏమైనా

దీని అమ్మ వాసన నాకిష్టం
తొట్టతొలి నా జన్మకు తల్లి అయినందుకేమో!

2

వొకా నొక అప్పుడు రోజూ నది యీవలి గట్టున
మెట్లకట్టన కొందరు ఎదిరి చూస్తుండేవారు
ఆ దరిన విచ్చే పుచ్చ పువ్వుల కోసం...
మర్రిచెట్టు నీడని మరేమీ పెరగదంటారు గానీ
ఆ ప్రేమలు ఎదిగినదే తన ఛాయన
నీళ్ళు ఆ బంధపు సేతువులు

యీ నల్లబండలపై నడుంవాల్చి చూడు
గాలి అలలై వచ్చే యీ కబుర్లు
యే మతాంతర ప్రేమికులు పోగేసుకున్న వూసులో
నీటి తెమ్మెరలపై తేలి వచ్చే యీ తడియాకుల లేఖలు
పరువు హత్యకు ముందు ఏ ప్రణయుడు రాసినవో

వీటిని జాగర్తచేసి పాదులో దాచిపెడతాను
నే వెళిపోయాక యే బాటసారో ఇక్కడ విశ్రమించి
కలవరపు కలలో పలవరించి
మత విద్వేషాల్లోనూ చిగురించిన
యీ మరుల గురించీ, మమతల గురించీ
లోకానికి చెప్పొద్దూ!
నదులంతే కొన్ని కొండల గురుతులు


- శ్రీనివాసమూర్తి, 74999 85329

# కొత్త వెలుగుని ప్రసరిస్తున్న తెలంగాణ విప్లవయోధులు

తెలంగాణ చరిత్రలో 19461956దశాబ్దం అత్యంత సమరశీలమైనది. అంతే సంవేదనాభరితమైనది. సంఘర్షణాయుక్తమైనది. సంక్షుభితమైనది. అంతేగాదు విలువైనది, విచిత్రమైనదీ. ఈ చరిత్ర కొంత విస్మరణకూ, మరెంతో వక్రీరణకూ గురైంది! ఎందుకు విలువైనదంటే హైదరాబాద్ రాజ్యం నుంచి రాష్ట్రంగా మారింది. ఏడో నిజామ్ ఉస్మానలీఖాన్ ప్రభువు నుంచి రాజ్ ప్రముఖ్‌గా మారిండు. ప్రపంచంలోనే అత్యధిక ధనవంతుడిగా పేరుగాంచిన ఈయన పాలనాశకం ముగిసింది. ఈ మార్పు ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ రాజ్యం విలీనానికి దారి తీసింది. ఈ దారిలోనే ఆంధ్రాధిపత్యం హైదరాబాద్‌కు వలస వచ్చింది. ఈ బలవంతపు విలీనపు 'యుద్ధం'లో నిజాం పాలిత మరత్వాడా, కర్నాటక ప్రాంతాల్లో లక్షల మంది ముస్లిములు ధన, మాన, ప్రాణాలు కోల్పోయింద్రు. ఇదే సమయంలో కమ్యూనిస్టు ప్రభావం మూలంగా తెలంగాణలో ముస్లిములు కొంతమేరకు రక్షించబడ్డారు. అరుదుగానే అయినా మెదక్, నల్లగొండ తదితర ప్రాంతాల్లో ముస్లిములు ఈ 'యాక్షన్'లో సఫర్ అయ్యింద్రు. అంతకుముందు ప్రధానంగా కమ్యూనిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనే రజకార్ల బెడద ఎక్కువగా ఉండింది. కమ్యూనిస్టుల కార్యకలాపాలు నిరోధించే పేరిట రజాకార్ల దోపిడీ, అత్యాచారాలు నిత్యకృత్యంగా జరిగేవి. ఈ రజాకార్ల నాయకుడు కాశిం రజ్వీకి అటు హిందూ దొరల మద్దతు, ఇటు నిజాం ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటు ఉండింది.

తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు 1946 జూలై నాలుగు నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు నిజాంకు వ్యతిరేకంగా సాయుధంగా రైతాంగ పోరాటం చేసింద్రు. 1948 సెప్టెంబర్ 18 నుంచి 1951 అక్టోబర్ 20 వరకు ఇండియన్ యూనియన్‌కు వ్యతిరేకంగా అదే తీరులో కొట్లాడిరద్రు. 1951 అక్టోబర్ 20 నాడు కమ్యూనిస్టులు సాయుధ పోరాట విరమణ ప్రకటించారు. నిజాం ప్రభుత్వంతో పోరాటంలో నాలుగు వందల మంది కార్యకర్తలు చనిపోగా, ఇండియన్ యూనియన్ మిలిటరీ చేతిలో నాలుగువేల మంది చనిపోయారు. ఇట్లా భిన్న రాజకీయాలు, మత ప్రచారాలు, కాశిం రజ్వీ దుందుడుకు చర్యలు, ఒకరిపై ఒకరు పై చేయి సాధించేందుకు ప్రజాపార్టీ, జాతీయపార్టీలు సాగించిన పోరాటాలు, అందుకు ఉపయోగించిన ప్రజా కళారూపాలు, దొరల దౌర్జన్యాలు, ఆర్యసమాజ్ పాత్ర, చైతన్యవంతులైన ప్రజల ప్రతిస్పందన, మానవ సంబంధాలు, మిలిటరీ హింసాకాండ అన్నింటిని లెఫ్ట్‌రైట్ లీనింగ్స్ లేకుండా స్ట్రెయిట్‌గా ఆనాటి పరిస్థితిని ఉన్నది ఉన్నట్టుగా, గుండెలను తట్టిలేపే విధంగా చిత్రించిన నవల 'తెలంగాణ విప్లవ యోధులు'. ఈ నవలను ఎం.ఆర్.నాగం అనే పొడి అక్షరాలతో తెలుగు సాహిత్యానికి పరిచయమున్న సూర్యాపేట జిల్లా నూతనకల్లుకు చెందిన నాగం మల్లారెడ్డి రాసిండు. ఆర్యసమాజ్, ఆ తర్వాత నాస్తికోద్యమ ప్రభావంతో ఆదర్శ జీవితం గడిపిన ఈయన రాసిన ఈ నవల తెలంగాణ సాయుధ పోరాటం/హైదరాబాద్‌పై పోలీసుచర్యపై తెలంగాణ వాసి రాసిన తొలి నవల. నవలగా కన్నా నవలికగా దీనికి గుర్తింపు, గౌరవం దక్కాలి.

1948కి ముందు తెలంగాణలో జమిందారీ వ్యవ




స్థ ఉండేది. కొన్ని ఊర్లు నిజాం ప్రత్యక్ష పాలనలో మరికొన్ని నిజామ్ సర్ఫేఖాస్, ఇంకొన్ని జమీందారీల అధీనంలో, మరికొన్ని సంస్థానాధీశుల పాలనలో ఉండేవి. ఇట్లా జమిందారీ వ్యవస్థలో ఉన్న ఒక ప్రాంతం 'దేవగిరి'. ఈ దేవగిరి జమిందారీ అధీనంలో మొత్తం 60 గ్రామాలుండేవి. ఈ 60 గ్రామాల కప్పం జమిందారే నిజామ్‌కు కట్టి దానికి బదులుగా ప్రజలనుంచి వెట్టిచాకిరి, లెవీ, పన్నుల రూపంలో పిండుకునేవారు. ఆ అరవై గ్రామాలకు తానే రాజు. తానే న్యాయ వ్యవస్థ. తానే పోలీసు కూడా! అనే విధంగా వ్యవహరించేవాడు. ఈ అరవై జమిందారీ గ్రామాల్లో ఒకటైన అనాశిపురం నుంచి తిరుగుబాటు ప్రారంభమయింది. ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంగా రూపం దీసుకున్నది. ఈ కమ్యూనిస్టు పేరు భగవాన్. ఈయనే భిక్షగాడుగా, కుమరయ్యగా 'ప్రజాపార్టీ'గా పేర్కొన్న కమ్యూనిస్టుల తరపున సాయుధ పోరాటం చేస్తాడు. సర్దార్ భగవాన్‌గా పేరుగాంచిండు. దేవగిరి జమిందారు రైతులనుంచి పన్నులు వసూలు చేసుకునేందుకు వీపు మీద 'బండలెత్తిం'చడాన్ని వ్యతిరేకిస్తాడు. వ్యతిరేకించడమే కాదు జమిందారుని నిలదీస్తాడు. రైతుల పక్షాన గట్టిగా నిలబడతాడు. దీంతో జమిందారు అనుచరులు ఇంద్రయ్య, కామమ్మల కొడుకైన భగవాన్‌ని విపరీతంగా కొట్టడమే గాకుండా, ఈయన తండ్రిని హతమారుస్తారు. తల్లి బతికే ఉన్నా కొన్ని రోజులకు స్ఫోటకం వ్యాధితో ఆమె మరణిస్తుంది. ఇట్లా ఒంటరివాడు, అనాథగా మిగిలి భిక్షగాడిగా అవతారమెత్తిన భగవాన్‌ని అదే జమిందారీలోని మరొక గ్రామం పల్లెపాడు గ్రామానికి చెందిన దొర కూతురు లీల ఆదరిస్తుంది. ఈ ఆదరణ ప్రేమగా పరిణమిస్తుంది. ప్రేమ నిలుపుకోవడం కోసం సాయుధ పోరాటంలో కలిసి పోతారు.

ఈ నవలలో నాగం మల్లారెడ్డి 'పన్నులు, జుర్మానాలు, లంచాలు, మామూళ్లు పేరుతో తెలంగాణ ప్రజల్ని దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండ్యాలు, భూస్వాములు, జాగీర్దార్లు, పటేలు, పట్వారీలు, పంజులు, సర్‌పంజులు, గుమాస్తాలు ఎట్లా దోచుకుంటున్నారో' చెప్పిండు. ప్రజలు 'కాల్మొక్త దొరా', 'నీ బాన్చని దొరా' అంటూ సలాములు చేయాల్సిన దుస్థితిని వివరించిండు. ఇలాంటి స్థితిని ఎదిరించేందుకు శాంతి, అహింస, సత్యాగ్రహ మార్గాన్ని ఎంచుకొని పోరాటాలకు శ్రీకారం చుట్టింది జాతీయ పార్టీ. ఇది కాంగ్రెస్ పంథాగా గుర్తించాలి. అట్లాగే హింసను హింసతోనే ఎదుర్కోవాలనే యోచనతో ప్రజాపార్టీ సాయుధ రైతాంగ పోరాటానికి ఇంకా చెప్పాలంటే 'గెరిల్లా' యుద్ధానికి పిలుపునిచ్చింది. ఇక్కడ ప్రజా పార్టీ అంటే ఆంధ్రమహాసభ నేతృత్వంలోని కమ్యూనిస్టు పార్టీగా చెప్పుకోవాలి. ఈ దశలో జమిందార్లకు రక్షణగా ప్రభుత్వం ఊళ్లన్నింటిని నిజాం మిలిటరీతో నింపింది. ఈ సైన్యం దోపిడీకి తెగబడింది. ప్రజల ఆస్తుల్ని జప్తు చేసింది. బలవంతంగా వసూలు చేసిన లెవీని గిడ్డంగుల్లో నిల్వ ఉంచింది. ఇట్లా "ఒక ప్రక్క తిండికై బీదలు అల్లాడుతున్ననూ ముక్కపట్టి, చీడదినిపోవునట్లు గోదాములలో నిల్వ చేయబడిన గోధుమలు, జొన్నలూ,సజ్జలూ మొదలగు ఆహారధాన్యాల్ని కిరసనాయిల్ పోయించి తగుల బెట్టించింది''. అని ప్రభుత్వ దమన కాండను నాగం పాఠకుల కండ్లముందుంచిండు. పార్టీ సానుభూతి పరుల ఆస్తుల్ని మిలిటరీ సహాయంతో జమీందార్లు సర్వనాశనం చేసింద్రు. తగులబెట్టింద్రు. మరోవైపు ప్రభుత్వానికి సహకరించే వారి ఆస్తులను పార్టీ ప్రజలకు పంచి పెట్టింది. అట్లాగే జంబియాలతో బాలింతలను పొడిచిన తీరుని, బాయినెట్‌లకు ఎర వేసిన పసిపాపల విషయాన్ని మల్లారెడ్డి ఈ నవలలో



డా. సంగిశెట్టి శ్రీనివాస్
9849220321

కండ్లల్ల నీళ్లు చిప్పిల్లే విధంగా చెప్పిండు. అంతేగాదు ప్రజా పోరాటంలో బస్సులు, రైళ్ల రవాణా మాత్రమే గాకుండా తపాల భట్వాడా కూడా ఆగిపోయిందని ఉద్యమ ఉధృతిని చెప్పిడు. ప్రభుత్వం పడిపోయే దశలో ప్రభువుని కాపాడేందుకు రజాకార్లు ముందుకొచ్చారని నాగం అభిప్రాయం. దేవగిరి పరగణాలోనే పోలీసు వారు ఎవరినో పట్టుకుని 'తుండెలుగా నరికి వేశారంట, ఆముదాల పేట పట్వారీని చంపేశారంట' అంటూ ఆనాటి హత్యల గురించి కూడా చెప్పిండు. ఆఖరికి పల్లెపాడు గ్రామానికి శివారెడ్డి దళం రావడం, భయంతో పటేలు దేవగిరికి పారిపోవడం, పోతూ పోతూ కూతురు లీలను పట్నంలో ఉండే తన తమ్ముడు దగ్గరి విడిచిపెట్టమని కుమరయ్యను ఆదేశించడం జరిగింది. అయితే కుమరయ్య 'లీలలు దళంలో చేరినారనే విషయాన్ని ఆయన గ్రహించలేక పోయారు. ఇట్లా కథ అనేక మలుపులు తీసుకొని చివరికి అనూహ్యమైన మలుపుతో ముగుస్తుంది. ఈ ముగింపు ద్వారా రచయిత తన అభిప్రాయాన్ని చెప్పిండు. ఈ ముగింపుని నవలలో చదివితేనే బాగుంటుంది. చెప్పడం బాగోదు.

నిజానికి ఇప్పటి వరకు తెలుగులో వెలువడిన నవలలన్నీ సాయుధ పోరాటాన్ని మాత్రమే బలంగా చిత్రించాయి. దాదాపు ఇవన్నీ కమ్యూనిస్టు దృక్పథంతో రాసినవే! అయితే కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను ఈ నవలలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యకలాపాలు కూడా ఈ నవలలో విరివిగా రికార్డయ్యాయి. అందుకే 1953లో నవల ప్రచురణకు కాంగ్రెస్ అభిమాని, స్వయంగా ఉద్యమంలో పాల్గొన్న మిర్యాలగూడా తాలూకాకు చెందిన తిప్పన కృష్ణారెడ్డి ఆర్థికంగా అండగా నిలబడ్డాడు.

తెలంగాణ నవలా సాహిత్యానికి మేలైన జోడింపు ఇది. ఇప్పటివరకు కేవలం కమ్యూనిస్టు దృష్టికోణంతో చేసిన సాహిత్యాన్నే చదువుకున్నాము. ఇప్పుడు నాణానికి మరోవైపు ఏమున్నదో కూడా ఈ నవల ద్వారా తెలుసుకుంటాం!

# దిగులు వర్ణం.. ఒక ఆధునిక ప్రయోగశాల

వచన కవిత్వం ఒక స్వతంత్ర కవితా రూపమే కాదు.. ఆధునిక మనిషి ఎదుర్కొంటున్న సామాజిక, వ్యక్తిగత, తాత్విక సంఘర్షణలను ఏకకాలంలో ఎలాంటి పరిమితులు లేకుండా వ్యక్తీకరించగల శక్తిమంతమైన సృజనాత్మక ప్రక్రియ. మనిషి ఉనికి, దైవం పాత్ర, ప్రకృతితో అతనికి ఉన్న సంబంధం, మరణం యొక్క అనివార్యత వంటి మౌలిక ప్రశ్నలపై వచన కవిత్వం లోతైన తాత్విక చర్చను ప్రేరేపిస్తుంది. ఈ ప్రేరణతో జీవన సత్యాన్ని, తాత్విక భావాలను సరికొత్త రూపకాలతో (New Metaphors) సృజనాత్మకంగా ఆవిష్కరించే అవకాశం ఏర్పడుతుంది. అటువంటి ప్రయత్నంగానే వంజారి రోహిణి తన కవిత్వాన్ని "దిగులు వర్ణం" పేరుతో సాహితీ లోకానికి సమర్పించారు.

'నల్ల సూరీడు' కథా సంపుటి, 'విజయ మహల్ సెంటర్ కథలు' వంటి రచనల ద్వారా పాఠకులకు సుపరిచితులైన వంజారి రోహిణి తాజా కవితా సంపుటి 'దిగులు వర్ణం'. ఈ శీర్షిక కేవలం "బాధ" లేదా "విచారం" అనే సరళార్థాన్ని మించి, జీవితాన్ని, సమాజాన్ని చూడటానికి ఒక నిర్దిష్ట దృష్టికోణాన్ని—అంటే 'దిగులు' అనే భావాత్మక ఫిల్టర్‌ను—సూచిస్తుంది. అందువల్ల ఈ సంపుటిలోని అధిక భాగం కవితలలో నిరంతర విచారం, అంతుచిక్కని బాధ, తీరని ఏకాంతపు అనుభూతి (Melancholy) కేవలం కనిపించడమే కాక, భావోద్వేగాత్మకంగా ఆవిష్కృతమవుతుంది.

ఈ సంపుటిలోని 'కన్నీటి జలధి', 'ఉనికి', 'దుఃఖపు వాగు మా నాయన', 'పహారా', 'సమాయత్తం', 'కాక్టెయిల్' వంటి కవితా శీర్షికలు తీవ్రమైన బాధను, నిరాశను, వ్యవస్థాత్మక దోపిడీని వ్యక్తపరుస్తూనే, ఆ బాధను కేవలం వ్యక్తిగత వేదన స్థాయిలో ఆపకుండా ఒక స్పష్టమైన భావోద్వేగ దృశ్యంగా (Visual Emotion) మలుస్తాయి. ఈ కవితలలో భావం వర్ణనగా కాక, అనుభూతిగా పాఠకుని ముందుకు వస్తుంది


పైన పేర్కొన్న ఆరు కవితలలోని సామాజిక, వ్యక్తిగత వేదనల సారాంశం 'దిగులు వర్ణం' అనే శీర్షికలో ఒకే కేంద్రంగా ఏకీకృతమవడం ఈ సంపుటికి అంతర్గత ఏకత్వాన్ని అందిస్తుంది. అందువల్ల ఈ కవితలు విడివిడిగా చదివినా, ఒక సమగ్ర భావ ప్రవాహంలో భాగాలుగా అనిపిస్తాయి. ఇదే ఈ సంపుటి పాఠకుడిని ఆకర్షించే ప్రధాన కారణాలలో ఒకటి.

ఈ కవితలు అన్నీ మొదట డబుల్ ఇన్వర్టెడ్ కామాస్ ("...") తో ప్రారంభమై, చివర్లో వాటితోనే ముగియడం గమనార్హం. ఇది కవయిత్రి ఉద్దేశపూర్వకంగా చేసిన ఒక కవితా ప్రయోగంగా భావించవచ్చు. తన సాధారణ శైలి కాకుండా, తాను ఎంచుకున్న వేరొక దృక్పథం నుంచే ఈ కవితలు చెప్పబడుతున్నాయనే సంకేతాన్ని ఇది ఇస్తుంది. సాహిత్యపరంగా, ముఖ్యంగా కవిత్వంలో, ఒక కవిత మొత్తాన్ని ఇన్వర్టెడ్ కామాస్‌లో ఉంచడం భావానికి ఒక విమర్శాత్మక దూరాన్ని కల్పిస్తుంది.

సాహిత్యంలో ఈ విధమైన నిర్మాణానికి ప్రధానంగా రెండు కారణాలు ఉంటాయి. మొదటిది — ప్రత్యక్ష ఉటంకింపు (Direct Quote). అంటే ఆ కవిత మొత్తం మరొక వ్యక్తి లేదా పాత్ర యొక్క అంతరంగ స్వరంగా పాఠకుడికి వినిపించాలనే ప్రయత్నం. రెండవది — వ్యంగ్యం లేదా ఎత్తిచూపడం (Irony / Highlighting). సమాజం అంగీకరించిన ఒక సత్యాన్ని లేదా అబద్ధాన్ని యథాతథంగా ఉటంకిస్తూ, దానిపై విమర్శను నిర్మించడం. ఈ ఆరు కవితలలో కవయిత్రి కేవలం పాత్రల గొంతుకగా మాత్రమే కాక, వాటి ద్వారా సమాజాన్ని నిలదీసే విమర్శకురాలిగా నిలుస్తుంది.

ముఖ్యంగా తన గొంతు ద్వారా ఉటంకించబడిన మాట అనే అర్థం బలంగా ఉంటుంది. కవితా రూపంలో ఉంటే, ఆ భావాలు లేదా మాటల ఎంపిక మాత్రం కవయిత్రిదే అవుతుంది. పైన ఉదహరించిన ఆరు కవితలలో ఏముందో చూద్దాం.

కన్నీటి జలధి' (పే.30) కవిత కులం, మతం, నైతికత లేని సమాజం పట్ల ఒక సున్నితమైన మనస్తత్వపు ఆవేదనను వ్యక్తం చేస్తుంది. "మనిషి జాడ మాత్రం జాడే లేదు" అనే పంక్తి నేటి సామాజిక సంక్షోభాన్ని సూటిగా ప్రశ్నిస్తుంది. అయితే చివర్లో కనిపించే "మానవత్వపు మనిషి" పట్ల ఉన్న ఆశ ఈ కవితకు పునరుద్ధరణ(Restoration) భావాన్ని అందిస్తుంది.




ఇందులో పదునైన వ్యంగ్యం కనిపిస్తుంది. మనుషుల కొట్లాటలను 'కాట్లకుక్కల'తో పోల్చడం ద్వారా, మనిషి తన నైతిక విలువలను ఎంతగా దిగజార్చుకున్నాడో రచయిత్రి ఉద్వేగ పూరితంగా వ్యక్తం చేశారు. కవిత మొదటిలో ఆక్రోశం ఉన్నా, చివరికి "మానవత్వపు మనిషి నెత్తిపై కన్నీటిని, పన్నీటిని కలిపిపోస్తాను" అనడం ఈ కవితలో మంచి అభివ్యక్తికి నిదర్శనంగా భావించవచ్చు

'ఉనికి' (పే.57) కవితలో మాటలకన్నా మౌనంగా, చర్యల ద్వారా వ్యక్తమయ్యే నిస్వార్థమైన దాంపత్య ప్రేమ చిత్రితమవుతుంది. ఖరీదైన ప్రేమ చిహ్నాలను తిరస్కరించి, గృహ జీవితంలోని సాధారణ అంశాల ద్వారానే అసాధారణమైన ప్రేమను వ్యక్తం చేయడం ఈ కవిత ప్రత్యేకత. "మా ప్రేమ భాష మౌనం" అనే ముగింపు ఈ బంధంలోని లోతును ప్రతిబింబిస్తుంది

'అడుగుల సవ్వడే హిందోళరాగం' (శ్రవ్య రూపకం), ఇల్లంతా రంగులద్దుకునేవి' (దృశ్య రూపకం), వంటలోని రుచిని 'అనురాగమేమో' అనడం (భావోద్వేగ రూపకం) వంటి సున్నితమైన ఉపమానాలు/ రూపకాలు కవితకు సౌందర్యాన్నిచ్చాయి. ఈ కవిత 'యాంటీరొమాంటిక్' ధోరణిని అనుసరిస్తుంది. 'ఖరీదైన హోటల్', 'గులాబీలు', 'ఐ లవ్ యు' వంటి ఆధునిక ప్రేమ చిహ్నాలను తిరస్కరించి, గృహ జీవితంలోని సాధారణ అంశాల ద్వారా అసాధారణమైన ప్రేమను వ్యక్తం చేసి మంచి అభివ్యక్తిని సాధించారు. 'మా ప్రేమ భాష మౌనం' అనే ముగింపు, ఈ బంధంలోని లోతును, పరస్పర అవగాహనను, మరియు అపారమైన నమ్మకాన్ని ఒకే వాక్యంలో నిక్షిప్తం చేసి, కవితకు మంచి ముగింపునిచ్చారు.

'దుఃఖపు వాగు మా నాయన'(67) కవిత భారతీయ రైతు జీవితంలోని శ్రమ, ఆశ, నిరాశల విషాదాన్ని వ్యవస్థాత్మక దోపిడీ నేపథ్యంతో ఆవిష్కరిస్తుంది. 'నెత్తుటి శిల', 'దుఃఖపు వాగు' వంటి రూపకాలు అణచివేయబడిన రైతు ఆక్రోశాన్ని ప్రతిబింబిస్తాయి.

దేవుడికి తొలిమొక్కు చెల్లించినా, రెప్పకొట్టకుండా పంటను కాచినా, చివరికి 'ఏలినోళ్ళ చీలికలు', 'దళారుల దందాలు' ఆశల మీద అగ్నివర్షం కురిపించడం వ్యవస్థాత్మక దోపిడీపై తీవ్రమైన విమర్శ చేశారు కవయిత్రి. ఈ కవితలో కొంత వ్యంగ్యాత్మకం కూడా వుంది. ఆశలు 'ధాన్యపు రాశులతో పోటీపడటం' అనేది రైతు జీవితపు అత్యంత సహజమైన లక్ష్యాన్ని సూచిస్తుంది. కన్నీరు 'దుఃఖపు వాగులో శోకపు మడుగులు కడుతూనే ఉంది' అనే రూపకం రైతు విషాదానికి అనంతమైన దృశ్యాన్నిస్తుంది. రచయిత్రి రైతును బేతాళ కథల్లోని ఆశ చావని విక్రమార్కునితో పోల్చినా 'విక్రమార్కుడు' అనే ధైర్యం కూడా, వరదలు, కరువు, చీడపీడల చితిమంటలు అనే నిరంతర వైఫల్యాల పైనే ఆధారపడి ఉంటుంది. వైఫల్యాలు లేకపోతే ఈ గొప్ప ఆశకు విలువే లేదు. అదే ఈ కవితలోని లోతైన విషాద సత్యం.

'పహారా' (పే.70) కవితలో రైతును దేశ సరిహద్దుల్లో పహారా కాసే జవానుతో పోల్చడం ద్వారా అతని త్యాగాన్ని, అభద్రతను తీవ్రంగా ఎత్తిచూపారు. 'పచ్చని పొలం నా ప్రార్థన మందిరం' అనేది రైతు యొక్క వృత్తి పట్ల ఉన్న భక్తిని, దైవత్వాన్ని ప్రతీకగా చూపించారు. రైతు పాత్రను సైనికుడి పాత్రతో పోల్చడం ఈ కవితలోని శక్తివంతమైన ఉపమానం. రైతును ప్రకృతి శక్తులు, 'వ్యవస్థలోని విధ్వంసక కుశక్తులు' అనే రెండు శక్తులు నిలువరించడం వ్యవస్థ వైఫల్యాన్ని స్పష్టంగా ప్రశ్నిస్తుంది.

'ఆవేదనతో చిల్లులు పడ్డ నా ఆకలి పేగులకు మళ్ళీ మళ్ళీ మాచికలు వేసి కుట్టుకుంటూ..మీ ఆకలి తీర్చడానికి శ్రమిస్తాను' అనే వ్యక్తీకరణ రైతుల ఆత్మ త్యాగాన్ని, నిరంతర పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు చూపడంలోని కవయిత్రి అభివ్యక్తిని అభినందించకుండా వుండలేము.

కవయిత్రి రోహిణి, ఈ కవితలో, రైతు యొక్క పనిని 'పహారా' (రక్షణ) అనే కేంద్రీకృత భావనతో సమానం చేశారు. అయితే, జవాను తుపాకీతో సరిహద్దులో నిలబడగా, రైతు 'ఉండేలు తిప్పుతూ' కంచె వేసిన చేలో ఉంటాడు. జవాను రక్షణ స్పష్టంగా, గుర్తించదగినది అయితే, రైతు రక్షణ 'ఆశ, నిరాశల త్రిశంకు స్వర్గం' లో ఊగిసలాడే అభద్రతతో కూడుకొని ఉంటుంది.

'సమాయత్తం' (పే.98) కవితలో, ప్రకృతిలోని జీవన చక్రాన్ని , సృష్టికి మూలమైన ప్రేమ తత్వాన్ని ఆరాధించడం, జగత్తు ఆకలి తీర్చడానికి ప్రకృతి సిద్ధమవుతున్న విధానమే ఈ కవితలోని వస్తువు. 'నింగి... నీటి బొట్లతో ప్రేమ వంతెనేసింది' అనే రూపకం వర్షాన్ని ప్రేమ రూపంగా చూపి, ప్రకృతిని ఒక సంయోగ దృశ్యంగా వర్ణించారు. 'హరిత కిరణాలు.. అక్షయపాత్ర కావటానికి సమాయత్తమవుతున్నాయి' అనేది ప్రకృతి యొక్క అపార దాతృత్వానికి ప్రతీకగా ఈ కవితలో చూపబడింది. కవిత మొత్తం ఒక శాంతమైన, ఆశాజనకమైన ధ్వనితో ప్రవహిస్తుంది. 'పుడమి గుండె పులకించి', 'ప్రేమ చెమ్మతో తడుపుకుంది' వంటి వ్యక్తీకరణలు ప్రకృతికి, జీవనానికి మధ్య ఉండే ఆర్ద్రమైన అనుబంధాన్ని నొక్కి చెబుతాయి. 'జయహో హరితం, జయహో కిరణం' అనే పంక్తులు ప్రకృతి ఆరాధనతో ముగిసి, కవితకు మంచి ముగింపునిచ్చాయి. 'కాక్టెయిల్'(పే.100) కవిత మరణం పట్ల మనుషుల వైవిధ్యమైన, కొన్నిసార్లు కృత్రిమమైన ప్రతిస్పందనలను వ్యంగ్యంగా ఆవిష్కరిస్తుంది. "మనుషులంతా రకరకాల కాక్టెయిల్‌లా" అనే ఆధునిక రూపకం ఈ కవితకు కేంద్ర బిందువుగా నిలుస్తుంది. 'మంచు గడ్డలా మారతారు' అనే వాక్యం ద్వారా, కొందరు తమ దుఃఖాన్ని లోపలే

స్తంభింపజేసుకుంటారని సూచించడం లోతైన మానసిక విశ్లేషణ. ఇది మంచి సిమిలీగా చెప్పవచ్చు . ఈ కవిత..ఆప్తుల మరణంలో కూడా రెండు కన్నీటి బొట్లు రాల్చని కఠిన శిలల ఉనికిని ప్రశ్నిస్తూ, దుఃఖంలో ప్రదర్శన కన్నా నిజాయితీ ముఖ్యం అనే సందేశాన్నిస్తుంది. కవయిత్రి జాలితో, వేదనతో ఈ విమర్శనాత్మక దృశ్యాన్ని చాలా భావ తీవ్రతతో ఆవిష్కరించారు. 'మనుషులంతా రకరకాలు కాక్టెయిల్ లాగా' అనే ఆధునిక రూపకం ఈ కవితకు కేంద్ర బిందువు. మనుషుల భావోద్వేగాలు అంతుచిక్కని ముగింపు, మరణం పట్ల మనుషుల ప్రతిస్పందనను మనం కేవలం చూడటం తప్ప, దానిని నిర్ణయించడం సాధ్యం కాదనే తాత్వికతను అందిస్తుంది. అర్థాన్ని (నిజాయితీని) కనుగొనే భారాన్ని పాఠకుడిపై ఉంచుతుంది.

వచన కవిత్వంలో నిత్యం వాడుకలో ఉన్న భాషను ఉపయోగించడం వల్ల, కవి/ కవయిత్రి యొక్క వ్యక్తిగత గొంతు (Unique Voice) మరియు తన ప్రాంతపు మాండలికం (Dialect) సులభంగా ప్రతిఫలిస్తాయి. పై ఆరు కవితలలో 'ఉనికి' కవితలోని మౌన ప్రేమ యొక్క వ్యక్తీకరణ ఈ కోవలోనిదే. పై విశ్లేషణలోని 'కాక్టెయిల్' కవితలోని మరణం పట్ల మనుషుల వైవిధ్యం, 'సమాయత్తం' కవితలోని ప్రకృతి ప్రేమతత్వం తాత్విక కోణాన్ని చూపిస్తాయి.

జీవితానుభవాలు, సామాజిక పరిశీలనలు, వ్యక్తిగత భావోద్వేగాల మేళవింపే వంజారి రోహిణిగారి కవిత్వం. ఆమె కవిత్వం ఒక నిజాయితీతో కూడిన గొంతు. అది జీవితంలోని మాధుర్యాన్ని, కష్టాలను, ఆనందాలను...అన్నింటినీ సమతుల్యంగా పంచుకుంటూనే..స్త్రీల అణగారిన వర్గాల అంతరంగ భావాలను శక్తివంతంగా, సున్నితంగా వ్యక్తం చేస్తుంది.

మొత్తంగా చెప్పాలంటే, 'దిగులు వర్ణం' ఒక కవితా సంపుటి మాత్రమే కాదు—నేటి మనిషి, సమాజం ఎదుర్కొంటున్న అంతర్మథనాలకు ఒక సున్నితమైన అద్దం. వంజారి రోహిణి కవిత్వంలో కనిపించే నిజాయితీ, అనుభవసారత, తాత్విక లోతు ఆమెను ఆధునిక తెలుగు వచన కవిత్వంలో ప్రత్యేకంగా నిలబెడతాయి.

- కొమ్మవరపు విల్సన్ రావు,
89854 35515

## మద్దూరి నగేష్ బాబు స్మారక పురస్కారం :

ధిక్కార కవి మద్దూరి నగేష్ బాబు స్మారక పురస్కారానికి ఈ సంవత్సరం కవితా సంపుటాలు ఆహ్వానిస్తున్నాము. 2023 నుంచి 2025 వరకు ప్రచురితమైన కవితా సంపుటాలు 4 కాపీలు పంపాలి. ఆఖరు తేదీ జనవరి 20, 2026. పురస్కార ప్రదానం ఫిబ్రవరిలో హైదరాబాదులో వుంటుంది. పురస్కార ప్రదానం కింద 15,000/- నగదు, మెమెంటో, సత్కారం వుంటుంది.

-----------------------------------------

## పైడి తెరేష్ బాబు స్మారక పురస్కారం :

పైడి తెరేష్ బాబు స్మారక పురస్కారానికి ఈ సంవత్సరం కథా సంపుటాలు ఆహ్వానిస్తున్నాము. 2023 నుంచి 2025 వరకు ప్రచురితమైన కథా సంపుటాలు 4 కాపీలు పంపాలి. ఆఖరు తేదీ జనవరి 20, 2026. పురస్కార ప్రదానం ఫిబ్రవరిలో హైదరాబాదులో వుంటుంది. పురస్కార ప్రదానం కింద 15,000/- నగదు, మెమెంటో, సత్కారం వుంటుంది.

-----------------------------------------

## కలేకూరి ప్రసాద్ స్మారక పురస్కారం :

కలేకూరి ప్రసాద్ స్మారక పురస్కారానికి ఈ సంవత్సరం అనువాద పక్రియలో సంపుటాలు ఆహ్వానిస్తున్నాము. 2023 నుంచి 2025 వరకు ప్రచురితమైన అనువాద కవిత గానీ, అనువాద కథా సంపుటాలు గానీ 4 కాపీలు పంపాలి. ఆఖరు తేదీ జనవరి 20, 2026. పురస్కార ప్రదానం ఫిబ్రవరిలో హైదరాబాదులో వుంటుంది. పురస్కార ప్రదానం కింద 15,000/- నగదు, మెమెంటో, సత్కారం వుంటుంది.

-----------------------------------------

## ఏటూరి వెంకయ్య నాయుడు&శకుంతలమ్మ స్మారక పురస్కారం

ఏటూరి వెంకయ్య నాయుడు&శకుంతలమ్మ స్మారక పురస్కారానికి ఈ సంవత్సరం కవితా సంపుటాలు ఆహ్వానిస్తున్నాము. 2023 నుంచి 2025 వరకు ప్రచురితమైన కవితా సంపుటాలు 4 కాపీలు పంపాలి. ఆఖరు తేదీ జనవరి 20, 2026. పురస్కార ప్రదానం ఫిబ్రవరిలో హైదరాబాదులో వుంటుంది. పురస్కార ప్రదానం కింద 10,000/- నగదు, మెమెంటో, సత్కారం వుంటుంది.

పుస్తకాలు పంపవలసిన చిరునామా :
పి.శ్రీనివాస్ గౌడ్
5-3-129/1, రోడ్ నెం: 2, బిల్డింగ్ నెం: 30, అపోలో ఫార్మశీ మందుల షాపు బిల్డింగ్
రామాలయం వీధి, శాంతి నగర్, కూకట్ పల్లి, హైదరాబాద్ - 500 072. సెల్ : 9949429449

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో అభివృద్ధికి కృషి

**పెద్దపల్లి నియోజకవర్గం ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, మహా :** పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి కృషి చేస్తున్నట్లు ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నిమధ్య జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచి వార్డు సభ్యులకు ఆయన హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన సవ్యంగా సాగుతుందని అన్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు విజయవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన విద్యా, వైద్యం, ఇద్దరమ్మా గృహాలు, ఉపాధి పై దృష్టి సారిస్తుందని వెల్లడించారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో పరిశ్రమలను తీసుకువచ్చి ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు పార్లమెంటులో మాట్లాడుతున్నానని వివరించారు. త్వరలో 500 నుంచి వెయ్యి కోట్లతో సెమీ కండక్టర్ ఇండస్ట్రీస్ తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. మంచిర్యాలలో వందే భారత్ స్టాప్ తీసుకురావడంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయని పేర్కొన్నారు. ఈఎల్ఐ స్కీమ్ కోసం పార్లమెంట్ లో ప్రస్థావించగా 80 వేల కోట్లతో పాటు, హమాలీవాడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి 10 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయిన విషయం మీకు తెలిసిందేనని చెప్పారు. సింగరేణి రైటైర్డ్ కార్మికుల పెన్షన్ 3 వందలు, వెయ్యి రూపాయల నుండి 10 వేలకు పెంచాలని పార్లమెంట్ లో డిమాండ్ చేశానని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ఉపాధి హామీపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పార్లమెంటులో తాను మాట్లాడినట్లు చెప్పారు. ఉపాధి హామీ కూలి దినాలు 100 నుంచి 60 దినాలకు కుదింపు, 90 వేల కోట్లు ఫండ్స్ తగ్గించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 రేషో కేటాయించడం దుర్మార్గమని విమర్శించారు. మహాత్మా గాంధీ పేరు లేకుండా చేయాలని భాజపా ప్రభుత్వం కుట్రపూనుతోందని వెల్లడించారు. మందమర్రి లేదర్ పార్క్ ఏర్పాటు, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు, స్థాపనకు తాను కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పెద్దపల్లి మణుగూరు రైల్వే లైన్ కోసం 4 వేల కోట్ల నిధులతో పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ప్రకటించారు. శాశ్వత త్రాగునీటి సమస్య తీర్చేందుకు చెన్నూర్, క్యాతనపల్లిలో అమృత్ స్కిం 2.0 పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్ హెచ్ 163 పెండింగ్ వర్క్ లను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రులను డిమాండ్ చేశానని చెప్పారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎదురవుతున్న సమస్యలపై సీసీఐ దృష్టికి తీసుకువెళ్ళానని అవి త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు. ఇండియకు చైనా, ఉక్రెయిన్ నుంచి యూరియా దిగుమతిలో చేపించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. రామగుండంలోని ప్లాంట్ ను సరిగా నడపకపోవడంతో 12 లక్షల మెట్రిక్ టన్నులకు బదులు 9 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు. ఈ కారణంగా రైతంగం యూరియా కొరకు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. బసంత్ నగర్ లో ఏయిర్ పోర్ట్ ఫీజుజుబిలిటీ రిపోర్ట్ కోసం 55 లక్షలు మంజూరు చేయడం తో ఎయిర్పోర్ట్ సర్వే జరిగిందని తెలిపారు. రానున్న కొద్ది రోజుల్లో రామగుండం ఎయిర్ పోర్టు కల సహకారం కానుందని చెప్పారు. గత ప్రభుత్వంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బాల్క సుమన్ 3 వేల నుంచి 5 వేల కోట్లు ఇసుక స్కామ్ చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ పై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బురదజాల్లడం మానుకోవాలని హితవు పలికారు. బెల్లంపల్లిలో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు రెండు వేల జాబ్ లు ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. తాను నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాదే లక్ష్యంగా కార్యాచరణ చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం ఇంటికి పదివేల రూపాయలు ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని అన్నారు. దేశంలో కళ్ళముందే ఓటు చోరీ జరుగుతుందని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి తదితరులు ఉన్నారు.



## గ్రంథాలయాలలో అందుబాటులో అవసరమైన పుస్తకాలు

**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలోని వివిధ గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఎంపీ గ్రంథాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ విద్యా రంగం, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, సామాగ్రిని సమకూరుస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టి అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతేకాకుండా పాఠకులకు, అభ్యర్థులకు త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెనుజులా దేశంపై అమెరికా దుర్మార్గమైన దాడులను ఖండించండి

ప్రపంచ శాంతి కి విఘాతం కలిగిస్తున్న అమెరికా సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం

యంసిపిఐ (యు) జాతీయ కమిటీ సభ్యులు వరికుప్పల వెంకన్న




**సూర్యాపేట జిల్లా మహా:** వెనుజులా దేశంలోని కారకాస్ మరియు ఇతర ప్రాంతాల లోని పౌర మరియు సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బొలివేరియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనుజులా పై దుర్మార్గమైన నేరపూరిత సైనిక దాడులను మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఐక్య) సూర్యాపేట జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని యంసిపిఐ (యు) జాతీయ కమిటీ సభ్యులు వరికుప్పల వెంకన్న జిల్లా కార్యదర్శి షేక్ నజీర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఐక్య రాజ్య సమితి నియమిత సూత్రాలను, భద్రత మండలి నియమ నిబంధనలు అమెరికా ఉల్లంఘించి దాడులకు దిగడం అన్ని రకాల అంతర్జాతీయ ప్రమాణాలు దికకరించడమే అవుతుందన్నారు. గత కొన్ని నెలలుగా వెనుజులా సరిహద్దు ప్రాంతాల్లో తమ సైనిక యుద్ధ నావికాదళం ను మోహరించిన తీరు ప్రపంచ దేశాలు అభిశంసన చేస్తున్న ఖాతర్ చేయకుండా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం నకు వర్తమాన, స్వయంప్రతిపత్తి, స్వయం పోషక విధానాలు కలిగిన దేశాలను వాటి ఆర్థిక వ్యవస్థను కుదేల్ చేయడం దుర్మార్గ చర్య అని ఈ విధానానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా శాంతి కాముకులు స్పందించాలని భారత దేశం అమెరికా యుద్ధోన్మాద దుష్ట చర్యలను గట్టిగా వ్యతిరేకించాలని యంసిపిఐ(యు) డిమాండ్ చేస్తున్నదని వరికుప్పల వెంకన్న షేక్ నజీర్ అన్నారు.

## వార్డు సరిహద్దుల ప్రకారం సక్రమంగా ఓటర్ లిస్ట్ లను తయారు చేయాలి

**ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మారగాని సైదులు**

**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో 1 నుండి 28 వార్డుల జాబితాలో వార్డు సరిహద్దుల ప్రకారం సక్రమంగా ఓటర్ లిస్ట్ ల ను తయారు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ హుజూర్ నగర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మారగాని సైదులు ఆదివారం హుజూర్ నగర్ మున్సిపల్ అధికారులకు అభ్యంతరాలు తెలుపుతూ వినతి పత్రం సమర్పించాడు డబుల్ ఓట్లను తొలగించాలని ఒక వార్డులో ఓట్లు మరొక వార్డులో రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు కుటుంబ సభ్యులను ఒకే వార్డులో ఉంచేలా చూడాలని ఓటర్ జాబితాలో ఫోటోలను ప్రచురించి లిస్ట్ విడుదల చేయాలని కోరారు. వార్డులలో బౌండరీస్ వార్డు ఇన్చార్జులు బిల్ కలెక్టర్లు ఓటర్ లిస్టు తయారు చేయాలని ఆయన అధికారులను కోరారు






## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు
- ఏఎంసి డైరెక్టర్ దొంతరమోని రాజు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి పదో వార్డు, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆయనను శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పట్ల నిరంతరం శ్రమిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తు, వందల కోట్లు వెచ్చించి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, ఇబ్రహీంపట్నం ఏఎంసీ డైరెక్టర్ దొంతరమోని రాజు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల సమస్యల గురించి, గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాల గురించి, రాష్ట్ర శాసనసభలో నిక్కచ్చిగా మాట్లాడిన నాయకుడు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని రాజు కొనియాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఈడుపుగంటి సుబ్బారావు కు శుభాకాంక్షలు తెలియజేసిన కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు



**సూర్యాపేట జిల్లా మహా:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఈడుపుగంటి సుబ్బారావు జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మిత్రులు శ్రేయోభిలాషులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు



## ఉద్యమకారుడు నర్సిరెడ్డికి కన్నీటి వీడ్కోలు

**డాక్టర్ చెరుకు సుధాకర్**

**వలిగొండ జనవరి 4 మహా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేసి రాష్ట్ర సాధన ఉద్యమంలో జైలు జీవితం గడిపిన వలిగొండ మండలం ఏదుళ్ళగూడెం గ్రామానికి చెందిన నోముల నర్సిరెడ్డి అనారోగ్యం వలన ఆదివారం తెల్లవారుజామున మృతి చెందరు ఉద్యమకారుడు మృతి చెందారన్న వార్త తెలియడంతో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పిడి యాక్ట్ పెట్టిన లెక్క చేయకుండా రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ యోధుడు డాక్టర్ చెరుకు సుధాకర్ ఆదివారం నోముల నర్సిరెడ్డి పార్థివ దేహం పై పుష్పగుచ్ఛం పెట్టి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాలు వృధా కావన్నారు చరిత్రలో ఉద్యమకారులు నిలిచిపోతారని అన్నారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ మరో ఉద్యమకారుడు టీయూజెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆంధ్రప్రభ రిపోర్టర్ పడమటి దామోదర్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి పలుసం రమేష్ కొమిరెల్లి సంజీవరెడ్డి దేగల పాండు నరేష్ రెడ్డి ఈతప మల్లేశం బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి మారగొని శ్రీనివాస్ గౌడ్ పబ్బు నరసింహ శీలం స్వామి ఎక్కల దేవి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమకారులు ఇంకా ఎంతమంది నేల కొరగాలి

**సంగిశెట్టి క్రిస్టఫర్**



**వలిగొండ, మహా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులు నేటికీ అనేకమంది ఒక్కొక్కరు నేలకు ఒరుగుతున్నారని ఇంకా ఎంతమంది నేలకు ఓరగాలని మలి దశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఆదివారం ఉద్యమకారుడు నోముల నర్సిరెడ్డి మృతి చెందడంతో డాక్టర్ చెరుకు సుధాకర్.తో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులు రాలిపోతుంటే నేటికీ పాలకులు ఉద్యమ సాధకులను పట్టించుకోకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రభుత్వం వెంటనే నోముల నర్సిరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని అలాగే ఉద్యమకారులను గుర్తించడానికి వెంటనే కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మారగోని శ్రీనివాస్ గౌడ్ శీలం స్వామీ ఎక్కలశ్రీనివాస్ ఈతాప మల్లేశం పబ్బు నరసింహ నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అసెంబ్లీ ఎన్నికల ముందువికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి



**రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్**

**సూర్యాపేట జిల్లా మహా:** హైదరాబాద్ మలక్ పేట లోని లూయిస్ బ్రెయిలీ పార్కులో ఆదివారం ఫెడ్ సమస్త అధ్యక్షులు గంగారం ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవ కార్యక్రమంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ పాల్గొని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్రెంచ్ విద్యా వేత్త, సృష్టికర్త,అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ ఎందరో అందుల చీకటి జీవితాల్లో వెలుగులు నింపి కళ్ళు కనిపించని వారికి భవిష్యత్తుపై ఆశలు కల్పిస్తూ వారి జీవితాల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించారనీ కేవలం స్పర్శతోనే అక్షరాలను గుర్తు పట్టి అంధులకు ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకునే విధంగా ఓ భాషను కనిపెట్టారని దీంతోనే నేడు ఎందరో అంధులు చదువుకుంటూ మంచి ఉన్నతమైన ఉద్యోగాలనుసాధిస్తున్నారని అందుల లిపి లూయిస్ బ్రెయిలీ జన్మ దినోత్సవ వేడుకలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించవలసి ఉన్నప్పటికీ తూతూ మంత్రంగానే ఆయన జన్మ దినోత్సవాన్ని నిర్వహిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ముఖ్యంగా అందుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొనైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు చెప్పిన విధంగా వికలాంగుల పెన్షన్ 6000 పెంచడంతోపాటు ఆర్టీసీలో వికలాంగులకు 100 శాతం రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని రాష్ట్రంలో వికలాంగుల అట్రాచిట్టి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని ముఖ్యంగా వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖగా కొనసాగించాలని స్థానిక సంస్థలు ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు.సూర్యాపేట శ్రీనివాస్ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మారవేణి చంద్రశేఖర్ యాదవ్ స్పెషల్ బిఈడి అభ్యర్థుల సంఘం రాష్ట్ర నాయకులు వాంకుడోత్ లాల్ సింగ్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థినేత బండి శ్రీనివాస్ విద్యార్థి సంఘం నాయకుడు ఎర్ర నరసింహం కుర్ర రమేష్ పాల్గొన్నారు

## ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న మాజీ సర్పంచ్ రాంచందర్

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**మొయినాబాద్ మహా:** మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన తలారి రేణమ్మ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) మృతురాలి కుటుంబాని పరామర్శించి ఆర్థికసాయంగా 10.000 రూపాయల ఆర్థిక సాయాన్ని మృతిరాలు భర్త తలారి చిన్న మరయ్యకు అందజేశారు. గ్రామంలోని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) తలారి రేణమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) మాట్లాడుతూ.. దేవుడు వారి కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని భాగోద్వేగంతో పేర్కొన్నారు. పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని, మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం నింపారు. మాజీ సర్పంచ్ ఇచ్చిన



చేయూతపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలారి రాజు, తలారి పద్మారావు, అంతయ్య, సామయ్య, చంద్రమౌళి, శ్రీను, శేఖర్, కార్తీక్, కిరణ్, పేదింటి రాజు, శ్రీకాంత్, ప్రశాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి ఉపాధ్యాయుడు దిక్సూచి

**సూర్యాపేట జిల్లా మహా:** సమాజానికి ఉపాధ్యాయుడు దిక్సూచి అని, విద్యావంతుల తయారీలో వారి పాత్ర ఎనలేనిదని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బస్కూరి కె.పి కుమార్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్ ఎల్ కె టాలెంట్ స్కూల్లో జిల్లా అధ్యక్షులు పిల్లల మర్రి కళింగం ఆధ్వర్యంలో క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.మంచి సమాజం రూపొందాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ విద్యను బోధించే ఉపాధ్యాయులు దైవంతో సమానమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ప్రైవేటు ఉపాధ్యాయుడి జీవితం మాత్రం మారడం లేదు అని అన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రభుత్వ నియమ నిబంధనలు వర్తింప చేయాలన్నారు.తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, పనిభారం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నిబంధనలు,చట్టాలు తెచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యం వారికి ఎలాంటి ఆదెరువు చూపకపోవడంతో వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బచ్చలకూరి జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి ఉపేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఇటుకల సైదులు గైగుళ్ళ మహేష్ యాదవ్, కట్టంకురు లక్ష్మణ్ గౌడ్, ధరావత్ రవీందర్, మారపంగ వెంకటేశ్వర్లు, జిల్లా సంయుక్త కార్యదర్శి గాజుల లక్ష్మణ్, జిల్లా కోశాధికారి రాపర్తి నాగరాజు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల స్రవంతి, జిల్లా కార్యవర్గ సభ్యులు మందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**వరంగల్ మహా;** వరంగల్ అర్బన్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ జన్మదినం సందర్భంగా ఆదివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్-2 (పిల్లిగుండ్లు) నందు 14వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య , డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సయ్యద్ ఇంతియాజ్ హాజరై, కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం వలస కూలీలకు, చిన్నారులకు పండ్లు, బిర్యాని పాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, మహిళలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంధ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నగర మేయర్, జిల్లా కలెక్టర్, కమీషనర్
- ఘనంగా డా.లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలు
- అంధ విద్యార్థుల ప్రతిభ కు ముగ్ధులైన జిల్లా కలెక్టర్



**వరంగల్ మహా;** అంధ విద్యార్థులు అవకాశాలను అంది పుచ్చుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ కొత్తవాడ లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై బ్రెయిలీ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అంధ విద్యార్థులు అంధులు అనే భావనను వీడి ఆత్మ స్థైర్యం తో ముందుకు వెళ్లాలని, వైకల్యం అనేది అవయవాలకు మాత్రమేనని లక్ష్యానికి కాదని అంధులు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఇటీవల భారత అంధ మహిళల జట్టు క్రికెట్ ప్రపంచ కప్ సాధించిందని గుర్తుచేశారు. కార్పొరేషన్ తరపున పాఠశాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు మౌలిక సదుపాయాలు అందిస్తామని ఈ సందర్భం గా మేయర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ పాటవాలు దాగి ఉన్నాయని రాగ యుక్తంగా పాటలు పాడడం తో పాటు చూపూ లేకున్న మొబైల్ ఫోన్ లో నంబర్ లను నొక్కితే శబ్దం ఆధారం గా నొక్కిన నంబర్ ను గుర్తించి చెప్పడం వారి ప్రతిభకు నిదర్శనం అని విద్యార్థులను మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ పాఠశాల యాజమాన్యానికి సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ అంధుల పాఠశాల లో వివిధ అభివృద్ధి పనుల కోసం గతం లో బల్దియా తరపున నిధులను అందించామని గుర్తుచేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన కేక్ ను అతిథులు అంధ విద్యార్థులతో కలిసి కట్ చేసి స్వీట్ లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఉన్నతికి సహకరిస్తున్న పలువురు దాతలను మేయర్ కలెక్టర్ కమిషనర్ లు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమం లో బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజారెడ్డి, వైద్యులు డా.లక్ష్మీ. నారాయణ మాజీ కార్పొరేటర్ ఎలుగం లీలావతి సత్యనారాయణ పాఠశాలనిర్వాహకులు నలివేల కళ్యాణి, మణిశంకర్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ గాంధీ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్-2016 34వ వార్షికోత్సవం

ప్రారంభించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ

**పరకాల, మహా:** హన్మకొండ జిల్లా పరకాల మండలంలో క్రియేటివ్ కరాటే డో వారి ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని మయూరి గార్డెన్లో ఏర్పాటుచేసిన రాజీవ్ గాంధీ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్2016 34వ వార్షికోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి విచ్చేసి వారి చేతుల మీదగా ప్రారంభోత్సవం చేసి బహుమతులు అందజేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, డాక్టర్ అభిరామ్, సమన్వయ కమిటీ సభ్యులు ఎండి రంజాన్ అలీ,మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ బండి సదానందం గౌడ్,మార్క రఘుపతి గౌడ్, నల్లెల్ల అనిల్ కుమార్, ఆర్ సి చైర్మన్ పాపయ్య, మాస్టర్ మాడ సంపత్, కరాటే మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు



## క్రీడల ద్వారానే మానసిక ఉల్లాసం

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి క్రికెట్ పోటీలను ప్రారంభించిన మేయర్

**వరంగల్ మహా;** క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. ఆదివారం బల్దియా పరిధి 2 వ డివిజన్ రెడ్డి పురం లోగల టి వి వి ఎస్ గ్రౌండ్స్ లో కార్పొరేషన్ కు చెందిన వివిధ విభాగాల జట్ల మధ్య రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మేయర్ క్రికెట్ ఆడి ప్రారంభించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే అధికారులు సిబ్బందికి ఇలాంటి పోటీలు ఉత్సాహాన్ని ఇవ్వడం తో పాటు పోటీ తత్వాన్ని ఆలవర్చుతూ మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని, ప్రతిసం. క్రికెట్ తో పాటు ఇండోర్ పరిధి లో నిర్వహించే క్రీడలను కూడా నిర్వహిస్తున్నామని కార్పొరేటర్ లకు కూడా వివిధ క్రీడాంశాల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని క్రీడా స్ఫూర్తి నింపేలా పోటీలు కొనసాగాలని, వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన విజేతలకు గణతంత్ర దినోత్సవం(26 జనవరి) న బహుమతులను ప్రధానం చేయనున్నట్లు మేయర్ తెలిపారు. అంతకు ముందు మేయర్ కమిషనర్ లు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచి, ప్రారంభ మ్యాచ్ ఆడనున్న శానిటేషన్ హార్టికల్చర్ టీమ్ ఆటగాళ్ళ తో పరిచయ కార్యక్రమం అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించి మ్యాచ్ ను తిలకించారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సి హెచ్ ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఏం హెచ్ ఓ డా.రాజేష్, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి



**మహేందర్ కుమార్ రెడ్డి**

55 వ సారి రక్తదానం చేసిన గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి

**ఆమనగల్లు, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు లియో క్లబ్ ఆధ్వర్యంలో కడ్తాల గ్రామంలోని ప్రగతి స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ లయన్ సంపతి జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, క్లబ్ అధ్యక్షులు కే గోవర్ధన్ రెడ్డితో కలిసి జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ గడ్డం మహేందర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని , దీనిని ప్రయోగ శాలల్లో తయారు చేయలేమని , కేవలం దాతల సహకారంతోనే రక్తం లభిస్తుందని డాక్టర్ మహేందర్ కుమార్ రెడ్డి అన్నారు. రక్త దానం చేయడానికి ముందుకు వచ్చిన యువతి యువకులను ఆయన అభినందించారు. రక్త దాతలు ప్రాణదాతలతో సమానమని ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా 42 మంది రక్తదానం చేసినట్లు క్లబ్ పి ఆర్ ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతను ఉత్సాహ పరుస్తూ జిల్లా గవర్నర్ 55 వ సారి రక్తదానం చేశారు. ఆరోగ్యవంతులైన యువతీ యువకులు తప్పనిసరిగా రక్తదానం చేయాలని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎల్సిఐఎఫ్ ఏరియా లీడర్ మాజీ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి, రీజియన్ చైర్మన్ సంపతి జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, క్లబ్ కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చైర్మన్లు ఎం అంజయ్య, కండే ఓంకారం, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, పసుల లక్ష్మారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డి, వేణు పంతులు, లయన్ సభ్యులు బిచ్చ నాయక్, ధోనాదుల మహేష్, చేగూరి వెంకటేష్, రాజేందర్, జహంగీర్ అలీ, లియో క్లబ్ చైర్మన్ శ్యాం సుందర్ గౌడ్, సెక్రెటరీ బి ధర్మేందర్, ట్రెజరర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని శవం లభ్యం

**వరంగల్ మహా;** వరంగల్ నగరం 22వ డివిజన్ పరిధిలో కొత్తవాడ 80 అడుగుల రోడ్డు వద్ద గుర్తుతెలియని 45 ఏళ్ల పురుషుడి మృతదేహాన్ని 212026 తేదీన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామని ఇతని ఆచూకీ తెలిసినవారు లేదా అతని బంధువులు ఎవరైనా ఉంటే స్థానిక మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో సంప్రదించగలరని మట్టేవాడ సబ్ ఇన్స్పెక్టర్ డి సాంబయ్య ఓ ప్రకటనలో తెలిపారు.



## గుర్తుతెలియని లారీ వాహనం ఢీ..వ్యక్తి మృతి

**వరంగల్ మహా;** వరంగల్ నగరం లోని ఆరెపల్లి ములుగు ప్రధాన రహదారి పై శనివారం రాత్రి కొత్తపేట ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ వద్ద గుర్తుతెలియని లారీ ఢీకొట్టిన ఘటనలో ఆరెపల్లి గ్రామానికి చెందిన అనిల్ గౌడ్ అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ఎనుమాముల పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతి చెందిన వ్యక్తిని ఎంజిఎం మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఘటన స్థలంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా గుర్తు తెలియని లారీని గుర్తించడంలో ఆధారాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



**మహా ఎఫెక్ట్**


www.Mahaadaily.com
మహా
తెలుగు దినపత్రిక
epaper.mahaadaily.com
03 Jan 2026 - Page 5

నిర్లక్ష్యానికి నిలువుటద్దం చింతపల్లిగూడ పార్క్!

- అధ్వానంగా మారిన ఓపెన్ జిమ్ పార్క్
- మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తేవాలి
- దళిత చైతన్య అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: చింతపల్లిగూడలోని ఓపెన్ జిమ్ పార్క్, అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా అధ్వానంగా మారిందని, ఉక్కుల అశోక్ తెలిపారు. శంషాబాద్ జోనల్, ఆదిబట్ల సర్కిల్, కొంగరకలాన్ డివిజన్ పరిధిలోని, చింతపల్లిగూడలోని ఓపెన్ జిమ్ పార్క్, అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని, దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్, పార్కును సందర్శించి ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... డాక్టర్ ఉక్కుల అశోక్, గ్రామానికి సమీపంలో ఉన్న ఈ పార్క్ ప్రజలకు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో పాటు, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరమ్మతులు, నిర్వహణ పనులు చేయకపోవడంతో, పిచ్చి మొక్కలతో గడ్డిగాదాతో పార్క్ దయనీయ స్థితికి చేరిందని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్క్ పరిస్థితిపై స్థానికులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్, నాయకులు శేరి రమేష్, ఉదుతల రవి గౌడ్, జోగు మహేందర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిరుపయోగంలో ఉన్న పార్కు ఉపయోగంలోకి..

- సమస్యపై మహాపత్రికలో ప్రత్యేక కథనం
- స్పందించిన ఆదిభట్ల డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి
- అపోహలు వద్దు.. సమస్యలు దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం
- మహా పత్రికకు, డాక్టర్ అశోక్ కు పలువురి ప్రశంసలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** మహాపత్రిక కథనం ఓ ప్రజాసమస్య పరిష్కారం అయింది. ఆదిభట్ల సర్కిల్ చింతపల్లిగూడలో నిరుపయోగంలో ఉన్న ఓపెన్ జిమ్ పార్క్ మహా ఎఫెక్ట్ తో వెంటనే ఉపయోగంలోకి వచ్చింది. మహా పత్రిక కథనానికి స్పందించిన ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్. జిహెచ్ఎంసి పరిధి, ఆదిభట్ల సర్కిల్ చింతపల్లిగూడలో నిరుపయోగంలో ఉన్న ఓపెన్ జిమ్ పార్క్ ఉపయోగంలోకి తీసుకొచ్చారు. డాక్టర్ ఉక్కుల అశోక్ వెలుగులోకి తేవడంతో, మహా పత్రిక ప్రచురించిన కథనానికి, ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి స్పందించి పార్కును శుభ్రం చేసి ప్రజలకు ఉపయోగానికి వచ్చేలా తీర్చిదిద్దడం జరిగింది. దీంతో పలువురు గ్రామ ప్రజలు మహా పత్రిక ప్రతినిధికి, ఉక్కుల అశోక్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

**సమస్యలు పరిష్కరిస్తాం.. డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి**

డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి స్పందిస్తూ ఆదిభట్ల సర్కిల్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న, అపోహలకు వెళ్లకుండా, తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన ప్రజలకు తెలిపారు. ప్రజా సమస్యల పట్ల ప్రజల కోసమే, అధికార యంత్రాంగం పనిచేస్తుందని అపోహలకు పోకుండా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వంద శాతం పరిష్కరిస్తామని మరొకసారి ప్రజలకు తెలియజేశారు.

# ఆమనగల్లు మున్సిపాలిటీ బీజేపీదే

మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తల సిద్ధం కావాలి

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె ప్రసాద్



**ఆమనగల్లు, మహా :** రానున్న మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తల సిద్ధం కావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి సభ్యులు కండె హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఎన్నికలు ఏవైనా ఆమనగల్లు మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.. పట్టణంలోని మానస గార్డెన్ లో ఆదివారం మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం బిజెపి పట్టణ అధ్యక్షులు కర్నాటి విక్రం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశానికి హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధిలో వివక్ష చూపాయని ఆవేదన వ్యక్తం చేశారు..కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో అమలు కాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ను బొంద పెట్టాలని ప్రజలను కోరారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల ఉనికి కోసం పోరాటాలు చేస్తున్నాయి తప్ప, ప్రజా సమస్యలు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి నిరంతరం పోరాడుతుందని చెప్పారు. ఎన్నికల సమయంలో వచ్చే బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పట్టణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డుల్లో గత బిజెపి పాలకవర్గం చేసిన అభివృద్ధి కళ్ళకు కనిపిస్తుందని చెప్పారు. గత ఐదు సంవత్సరాలు మున్సిపాలిటిపై జ్ఞాపకం లేని ఈ నాయకులు ఇప్పుడు అసత్య ఆరోపణలకు, బిజెపి పాలకవర్గంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 10 సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వాలు వేసిన శిలాఫలకాలు.. అలాగే ఉన్నాయి కానీ.. ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపించాలని కోరారు. పాలకవర్గం శక్తి మేరకు ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేశారని హరిప్రసాద్ గుర్తు చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నేనావత్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, నాయకులు, మాజీ కౌన్సిలర్లు గోరేటి నరసింహ, చెక్కల లక్ష్మణ్, శ్రీకాంత్ సింగ్, దుడ్డు కృష్ణ యాదవ్, కృష్ణ నాయక్, చెన్నకేశవులు, తల్లోజు విజయకృష్ణ, ముక్తాల వెంకటయ్య, ఎర్రవోలు రాజు, మహేష్, గాజుల మల్లయ్య, దుసకంటి యాదయ్య, రవి రాథోడ్, పద్మ ప్రశాంత్, దేరంగుల రాజశేఖర్, రేవల్లి రాజు, బ్రహ్మం, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నిరుపేదల ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యం



**ఆమనగల్లు, మహా:** లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ పిలుపుమేరకు ఈనెల 3వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరుగుతున్న అన్న ప్రసాద వారోత్సవాల సందర్భంగా కడ్తాల బస్టాండ్ ఆవరణలో అన్నదాన శిబిరాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి గారితో కలిసి జిల్లా గవర్నర్ మహేందర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ మహేందర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వాలు ఎన్ని వెల్ఫేర్ ప్రోగ్రాం లు చేసినా ఆకలి , పేదరికం ఇంకా కనబడుతోంది . దీన్ని గుర్తించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ జనవరి 3 నుండి 11 వరకు ఆకలి నిర్మూలన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డిస్టిక్ 320 ఏ జిల్లా గవర్నర్ జి మహేందర్ కుమార్ రెడ్డి జిల్లాలోని 92 క్లబ్ లు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం తీసుకున్నాయి. అందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు , కడ్తాలలో అన్నదాన శిబిరాన్ని ప్రారంభించినట్లు. పేదరికం తోటి ఆకలితో అలమటిస్తున్న వారికి లయన్స్ క్లబ్ అండగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 450 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మానవసేవయే మాధవ సేవ అని ఆయన పిలుపునిచ్చారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమాన్ని బస్టాండ్ ఆవరణలో ఉన్న బాటసారులకు ప్రయాణికులకు ఆ ప్రాంతంలో ఉన్నవారికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్ పర్సన్ సంపతి జనార్ధన్ రెడ్డి, మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య, క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చైర్మన్ లు ఎం అంజయ్య, కండే ఓంకారం, జూలూరి రమేష్, పసుల లక్ష్మారెడ్డి, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డి, వేణు పంతులు, లయన్స్ సభ్యులు గూడూరి శ్రీనివాస్ రెడ్డి, డి మహేష్, జహంగీర్ అలీ, కర్నాటి కొండల్ రెడ్డి, లియో క్లబ్ సభ్యులు శ్యాంసుందర్ గౌడ్, శేషేందర్, బి ధర్మేందర్, క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ రోడ్డు భూ నిర్వాసితులకు అండంగా ఉంటాం: ఎంపీ ఎమ్మెల్యే



**ఆమనగల్లు, మహా:** గ్రీన్ ఫీల్డ్ రోడ్డు భూ నిర్వాసితులకు అండంగా ఉంటామని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని ఎంపీ డా.మల్లు రవి నివాసం లో కడ్తాల్ అమనగల్ మండల పరిధిలోని ముద్వేన్, ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, కోనాపూర్, ఆకుతోటపల్లి గ్రామ మా రైతులతో ముఖముకి సమావేశం నిర్వహించారు., ఈ సందర్భంగా వారి ప్రధాన సమస్యలను ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ లోని సీఎం ఛాంబర్ లో సీఎం గారితో సమావేశం జరిపి భూ నిర్వసితుల సమస్యలపై చర్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాలకూర్ల రవికాంత్ గౌడ్, ఎక్వాయిపల్లి సర్పంచ్ పాలకుర్ల కరుణాకర్ గౌడ్, మర్రిపల్లి సర్పంచ్ రవి, నాయకులు గుర్రం కేశవులు, మధుసూదన్ రెడ్డి, రచ్చ శ్రీరాములు, సుమన్, హరీష్, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇలా పొదుపు చేస్తే.. నెల మొత్తం హ్యాపీ!



డబ్బు సంపాదించడం మాత్రమే కాదు, ఆ డబ్బును సరైన విధంగా పొదుపు చేయకపోతే భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి 70/10/10/10 ఫార్ములా ప్రకారం.. మీరు డబ్బును ఖర్చు చేస్తే.. తప్పకుండా ఆర్థిక ఇబ్బందుల నుంచి భయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ ఫార్ములా గురించి మరిన్ని వివరాలు వివరంగా..

**ఏమిటీ 70/10/10/10 ఫార్ములా**

మీరు సంపాదించే డబ్బు లేదా నెలవారీ సంపాదనను నాలుగు భాగాలుగా విభజించుకోవాలి. ఎంత డబ్బు దేనికి ఖర్చు చేయాలనే విషయాన్ని ముంచుగానే ఊహించాలి. అప్పుడే.. నెల చివరలో కూడా డబ్బు కోసం ఇబ్బందిపడాల్సిన అవసరం ఉండదు.

**70 శాతం:**

మీ నెల జీతంలో 70 శాతం డబ్బును.. ఇంటి అద్దె, నిత్యావసర వస్తువుల కోసం, ప్రయాణ ఖర్చులకు, పిల్లల ఖర్చులు, బీమా వంటి వాటికోసం కేటాయించాలి. అంటే.. ప్రస్తుత జీవన విధానం కోసం ఆ డబ్బును వెచ్చించాలన్నమాట.

**10 శాతం:**

మీ నెల జీతంలో 10 శాతాన్ని పొదుపు (సేవింగ్స్) చేయడానికి కేటాయించాలి. అంటే మ్యూచువల్ ఫండ్స్, రిటైర్మెంట్ ఫండ్స్ లేదా స్టాక్ మార్కెట్ వంటి వాటిలో పెట్టుబడి పెట్టడానికి ఉపయోగించాలన్నమాట. ఎందుకంటే.. భవిష్యత్తు కోసం కూడా తప్పకుండా కొంత డబ్బు పొదుపు చేయాల్సిందే.

**10 శాతం:**

మీ నెల సంపాదనలో మరో 10 శాతం.. అత్యవసర నిధి మాదిరిగా.. అంటే ఎమర్జెన్సీ సమయంలో ఈ డబ్బును ఉపయోగించుకోవచ్చు. ప్రయాణాలు చేయడానికి, ఆకస్మిక వైద్యం కోసం.. కొన్ని గృహోపకరణాల కోసం కూడా దీనిని కేటాయించుకోవచ్చన్నమాట.

**10 శాతం:**

మిగిలిన 10 శాతం.. ఈఎంఐ, లేదా అప్పులు వంటివి చెల్లించడానికి ఉపయోగించుకోవచ్చు. ఒకవేలా అప్పు లేదా ఈఎంఐ లేకపోతే.. కొత్త విషయాలను నేర్చుకోవడానికి, విదేశీ విద్య కోసం కూడా ఉపయోగించుకోవచ్చన్నమాట.

మీ జీతం నెలకు లక్ష రూపాయలు అనుకుంటే.. అందులో రూ. 70వేలు (70 శాతం) ఇంటి అద్దె మొదలైనవాటికి, మిగిలిన 30 శాతాన్ని ఫార్ములా ప్రకారం కేటాయించుకోవాలి. ఈ ఫార్ములా మీరు పాటిస్తే.. ఉన్న డబ్బును ఎలా ఉపయోగించుకోవాలో స్పష్టంగా అర్థమవుతుంది.

## బీఎస్ఎన్ఎల్ కొత్త రీఛార్జ్ ప్లాన్

### ఏడాదంతా అన్‌లిమిటెడ్ కాల్స్




రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ఐడియా వంటి టెలికామ్ కంపెనీలు ఎప్పటికప్పుడు తమ కస్టమర్ల కోసం లేటెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్ ప్రవేశపెడుతున్న సమయంలో.. బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) కూడా అదే బాటలో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఉప్పుడు తాజాగా 365 రోజుల ప్లాన్ ప్రకటించింది. బీఎస్ఎన్ఎల్ ప్రకటించిన 365 రోజుల ప్లాన్ కోసం.. యూజర్లు 2799 రూపాయలు రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. న్యూ ఇయర్ సందర్భంగా కంపెనీ ఈ లేటెస్ట్ ప్లాన్ తీసుకొచ్చింది. ఇతర టెలికామ్ కంపెనీల వార్షిక ప్లాన్లతో పోలిస్తే.. బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న ప్లాన్ చాలా తక్కువే.

బీఎస్ఎన్ఎల్ యూజర్లు ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. రోజుకు 3జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజులు 100 ఎస్ఎమ్ఎస్‌లను పొందవచ్చు. అంటే రూ. 2799తో రీఛార్జ్ చేసుకుంటే.. ఏడాది మొత్తం అపరిమిత కాల్స్ మాట్లాడుకోవచ్చన్నమాట.

## బంగారం, వెండి ధరలు మరింత పెరుగుతాయా?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ సైన్యం వెనెజువెలా రాజధాని కారకాస్‌పై భారీ దాడులు చేసి, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన సంఘటన (US attack on Venezuela) ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి వంటి సేఫ్ హెవెన్ ఆస్తుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**బంగారం, వెండి ధరలపై ప్రభావం**

భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగినప్పుడు పెట్టుబడిదారులు బంగారం, వెండి వైపు మళ్లుతారు. ఈ దాడి కారణంగా అనిశ్చితి పెరిగి, సేఫ్ హెవెన్ డిమాండ్ పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుత ధరలు (జనవరి 4 నాటికి భారత మార్కెట్‌లో) 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1,35,800 నుంచి రూ.1,37,000 వరకు (MCX ఫ్యూచర్స్ ప్రకారం) ఉంది. అలాగే 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర సుమారు రూ.1,24,500. ఇక వెండి కిలోకు సుమారు రూ.2,40,000 నుంచి రూ.2,46,000 వరకు ఉంది.

**మరింత పెరిగే అవకాశం**

నిపుణుల అంచనా ప్రకారం.. ఈ ఉద్రిక్తతలు కొనసాగితే బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్‌కు 4,380 నుంచి 4,500 డాలర్లకు చేరవచ్చు. భారత్‌లో 10 గ్రాముల ధర రూ.1,40,000 స్థాయిని తాకే అవకాశం ఉంది. వెండి ధరలు మరింత గణనీయంగా పెరిగి, అంతర్జాతీయంగా ఔన్స్‌కు 7578 డాలర్లకు చేరవచ్చని అంచనా. ఇది సప్లై చైన్ డిస్టర్బెన్స్ (వెనెజువెలా ప్రాంత షిప్పింగ్ రూట్లు ప్రభావితం) కారణంగా కూడా జరుగవచ్చు. అయితే, ఈ పెరుగుదల తాత్కాలికమే కావచ్చు. ఉద్రిక్తతలు తగ్గితే ధరలు స్థిరపడవచ్చు లేదా కొద్దిగా పడిపోవచ్చు. 2026లో మొత్తంగా బంగారం ధరలు ఔన్స్‌కు 5,000 డాలర్లకు చేరే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఇన్నోవా క్రిస్టాకు కౌంట్‌డౌన్!.. నిలిపివేతా?




భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇన్నోవా క్రిస్టా కారును టయోటా కంపెనీ నిలిపివేయడానికి సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. సంస్థ దీనిని 2027 నాటికి దశలవారీగా తొలగించనున్నట్లు కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టయోటా కంపెనీ 2025లో మొదటిసారిగా.. తన ఇన్నోవా క్రిస్టా కారును దశలవారీగా తొలగించాలని ప్రణాళిక వేసింది, కానీ హైక్రాస్ ప్రవేశపెట్టిన తర్వాత.. కూడా క్రిస్టా ఉత్పత్తిని విస్తరించాలని నిర్ణయించుకుంది. అయితే కఠినమైన ఉద్గార నిబంధనలు కారణంగా.. దీనిని నిలిపివేసేందుకు ఇప్పుడు సంస్థ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కఠినమైన CAFE (కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయెల్ ఎఫిషియన్సీ) నిబంధనల ప్రకారం.. కంపెనీ హైబ్రిడ్ మోడళ్లను లాంచ్ చేయడానికి ఆసక్తి చూపుతోంది. ఇదే జరిగితే.. చాలాకాలంగా ఆటోమొబైల్ మార్కెట్లో తన హవా కొనసాగించిన కారు కనిపించకుండా పోయే అవకాశం ఉంది. అంటే భవిష్యత్తులో కొత్త క్రిస్టా కారును కొనుగోలు చేయలేమని తెలుస్తోంది. ప్రస్తుతం ఇన్నోవా క్రిస్టా 2.4 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో మాత్రమే విక్రయిస్తోంది. ఇది 148 BHP & 343 Nm టార్క్ అందిస్తుంది. ఇది 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ కలిగి మంచి పనితీరును అందిస్తుంది. ఇప్పటికే చాలా కంపెనీలు డీజిల్ కార్ల విక్రయాలను తగ్గిస్తున్నాయి. ఇది కూడా టయోటా కంపెనీ తన క్రిస్టా కారును నిలిపివేయడానికి ఒక కారణం అని తెలుస్తోంది.




# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## ఇంటర్నెట్‌పై ఇరాన్ కీలక నిర్ణయం




ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడి ఇంటర్నెట్ వినియోగం భారీ స్థాయిలో తగ్గినట్లు అక్కడి నివేదికలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోనే ఇంటర్నెట్, సోషల్ మీడియాలపై కఠిన ఆంక్షలు విధించిన దేశాల్లో ఇరాన్ టాఫ్ ప్లేసులో ఉందని అక్కడి సర్వేలు పేర్కొన్నాయి. ఇరాన్‌లో ప్రస్తుతం ఆర్థికసంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ పతనం, మానవహక్కుల ఉల్లంఘన తదితర కారణాలతో అక్కడి ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. దీంతో పెద్దఎత్తున నిరసనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం ఇంటర్నెట్ వాడకంపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. సోషల్ మీడియాలతో పాటు ఇతర సాధనాలపై బ్యాన్ విధించింది. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు ఉండడంతో ప్రధాన సోషల్ మీడియా సాధనాలైన యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర వాటిపై పూర్తిస్థాయిలో నిషేదం విధించింది. అదే ఇరాన్ ఇజ్రాయెల్ ఘర్షణ సమయంలో దాదాపు పూర్తి స్థాయిలో దాదాపు 90 నుంచి 97శాతం ఇంటర్నెట్ సేవలను బ్యాన్ చేసింది. అంతేకాకుండా ఇంటర్నెట్‌లో వచ్చే ప్రతి కంటెంట్‌పై అక్కడి ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఉంచింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న కంటెంట్‌లను ప్రసారం కాకుండా ఆంక్షలు విధించింది.

**డిజిటల్ అపార్థైడ్**

అంతేకాకుండా ఇరాన్‌లో ఇప్పుడు అనుమతి ఉన్న వ్యక్తులు, సంస్థలకు మాత్రమే వైట్ సిమ్ కార్డులు ఇస్తున్నారు. ఇవి ఉన్న వ్యక్తులు మాత్రమే ఇంటర్నెట్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా సేవలు పొందగలరు. సాధారణ ప్రజలకు ఇంటర్నెట్ వాడకంపై కొన్ని పరిమితులు కల్పించబడ్డాయి. దీంతో ఈనియమంపై అక్కడ దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగుతున్నాయి. ఇలా నిరంతరంగా ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించడంతో ఆదేశ ఎకానమీపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం డిజిటల్ ఎకానమీ ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో రోజువారీ దైనందిన అవసరాలకు ఇంటర్నెట్ అవసరమైన నేపథ్యంలో ఆంక్షలు నేపథ్యంలో ఎకానమీపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ ద్వారా గ్లోబల్ ఇంటర్నెట్ వ్యవస్థ నుండి దేశాన్ని వేరుచేసి ఇరాన్‌కు చెందిన ప్రత్యేక ఇంటర్నెట్ వ్యవస్థను సృష్టించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## వెనెజువెలాకు స్వేచ్ఛ తిరిగొచ్చింది: మచాడో



నికొలస్ మదురోను అమెరికా నిర్బంధించిన తర్వాత వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో తొలిసారిగా స్పందించారు. అమెరికా హామీని నిలబెట్టుకుందన్న మచాడో.. ఆ దేశాధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్యను అమెరికా సైన్యం బందీగా తీసుకెళ్లడంతో వెనెజువెలాకు స్వేచ్ఛ తిరిగి వచ్చిందంటూ ప్రకటించారు. వెనెజువెలా ప్రజలను ఉద్దేశిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టిన మచాడో.. వెనెజువెలా ప్రజలు, ఇతర దేశాల పౌరులపై జరిగిన దారుణమైన నేరాలకు నికొలస్ మదురో ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. ''మదురోపై మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నార్కోటెర్రరిజం ఆరోపణలు ఉన్నాయి. చర్చలతో సమస్య పరిష్కారానికి ఆయన నిరాకరించాడు. దీంతో అమెరికా తన హామీని నిలబెట్టుకుంది' అని మచాడో ట్వీట్ చేశారు.

ప్రజాస్వామ్యం కోసం కొన్నేళ్లుగా తాను చేసిన పోరాటం ఫలించిందన్న మచాడో.. శాంతియుతంగా, ప్రజస్వామ్యబద్ధంగా అధికార మార్పిడికి ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. కాగా, వెనెజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను వెనెజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. నెజువెలా అధ్యక్షుడు మదురోను బందీగా పట్టుకెళ్లాక ఆ దేశ పరిపాలనా బాధ్యతలను తామే చూసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

''అధ్యక్షుడిని ఇప్పటికే బంధించాం. ఇక పరిపాలనా బాధ్యతలను మేమే చూసుకుంటాం. మా కనుసన్నల్లో ఎవరి చేతుల మీదుగా పరిపాలన జరగబోతోందనేది త్వరలోనే ప్రకటిస్తాం. నూతన ప్రభుత్వం ఏర్పడి భద్రంగా, సవ్యంగా, పారదర్శకంగా అధికార బదిలీ జరిగేదాకా పరిపాలన బాధ్యత మాదే. పరిపాలన సవ్యంగా సాగేలా చూసుకుంటాం'' అని ట్రంప్ అన్నారు. విపక్ష నేత మరియా కొరీనా మచాడోకు పాలనా బాధ్యతలు అప్పగిస్తారా? అని మీడియా ప్రశ్నించగా.. ''ఆమె సారథ్యంలో పాలన కష్టమేమో. ఆమెకు వెనెజువెలా ఇంటా, బయటా పూర్తిస్థాయి మద్దతు లేదు. అయినా ఆమె చాలా మంచి మనిషి'' అని పేర్కొన్నారు. 'వెనెజువెలా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రెజ్‌తో మాట్లాడా.. అమెరికా ఏమి అడిగినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె నాతో చెప్పారు''అని ట్రంప్ వెల్లడించారు.

## డ్రైవర్ నుంచి అధ్యక్ష పీఠం దాకా



**మహా:** అత్యంత సాదాసీదా నేపథ్యం. పుట్టింది ఓ సామాన్య కార్మికుని కుటుంబంలో పనిచేసింది బస్సు డ్రైవర్‌గా. అలాంటి స్థాయి నుంచి ఏకంగా దేశాధ్యక్ష పీఠం దాకా! చివరికి నియంతగా అప్రతిష్ట మూటగట్టుకుని ఏ పెద్ద దేశం అధ్యక్షునికీ జరగని రీతిలో పరాయి దేశ బందీగా మారిన దైన్యం. వెనెజువెలా తాజా మాజీ అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రస్థానం ఆద్యంతం ఆసక్తికరం... నికొలస్ మదురో 1962లో వెనెజువెలా రాజధాని కరాకాస్‌లో అతి సామాన్య కుటుంబంలో పుట్టారు. ఆయన బాల్యం సాధారణంగానే గడిచింది. చదువు హైసూక్‌లు స్థాయి దాటలేదు. క్యూబాలో ఏడాది పాటు వామపక్ష సిద్ధాంతాల్లో శిక్షణ పొంది వచ్చారు. కార్మిక సంఘం నేత అయిన తండ్రి నుంచి నాయకత్వ వాసనలను మదురో బాగా వంటబట్టించుకున్నారు. 1992లో మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ అధికార కైవసానికి విఫలయత్నం చేసిన రోజుల్లో ఆయన బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. జైలుపాలైన చావెజ్ విడుదల కోసం జరిగిన ఉద్యమంలో ముందుండి నడిచారు.

మదురో జీవితంలో అదే కీలక మలుపు. చూస్తుండగానే చావెజ్ వామపక్ష ఎజెండాకు గట్టి మద్దతుదారుగా మారారు. ఆ క్రమంలో తండ్రిలా తానూ కార్మిక సంఘ నేత అయ్యారు. అనంతరం చావెజ్ సారథ్యంలోని యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనెజువెలాలో చేరి చకచకా కీలక స్థానానికి ఎదిగారు. 1998లో చావెజ్‌తో పాటు తానూ జాతీయ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తర్వాత అసెంబ్లీ అధ్యక్షుడయ్యారు. చావెజ్ అధ్యక్షుడయ్యాక ఆయన కేబినెట్లో విదేశాంగ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రపంచమంతా కలియదిరిగి అంతర్జాతీయంగా వెనెజువెలాకు మద్దతు పెంచడంలో మదురో కీలకపాత్ర పోషించారు. అమెరికా కర్రపెత్తనాన్ని, ఆంక్షలను ఎదుర్కొనేందుకు లాటిన్ అమెరికా-కరీబియన్ కూటమి ఏర్పాటు చేశారు.

ఈ దశలోనే చావెజ్‌కు అత్యంత నమ్మకస్తునిగా మారారు. ఫలితంగా 2012లో వెనెజువెలా ఉపాధ్యక్షుడయ్యారు. మదురోను తన రాజకీయ వారసునిగా చావెజ్ ప్రకటించారు. 2013లో అనారోగ్యంతో చావెజ్ మరణించడంతో మదురో తొలుత తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో గెలుపొంది అధ్యక్ష పీఠాన్ని పదిలపరుచుకున్నారు. నాటినుంచి పాలకునిగా కొనసాగుతూనే ఉన్నారు. అయితే ఆ క్రమంలో ప్రతి ఎన్నికల్లోనూ విపరీతమైన అక్రమాలకు పాల్పడ్డారన్న అపకీర్తి మూటగట్టుకున్నారు. 2013 నాటి తొలి ఎన్నికల నుంచే ఆయనపై ఈ ఆరోపణలున్నాయి.

**చివరకు ఇలా నేలకు!**

చావెజ్ మరణానంతరం అధ్యక్షుడు కాగలిగినా పరిస్థితులన్నీ క్రమంగా మదురోకు ప్రతికూలించ సాగాయి. అసలు ఆయన అధ్యక్ష జీవితమంతా వివాదాలు, సమస్యలమయంగానే సాగింది. ముఖ్యంగా వెనెజువెలా ఆర్థిక పతనం ఆయనకు పెద్ద సవాలుగా మారింది. అమెరికా ఆంక్షలకు తోడు అంతర్జాతీయ చమురు ధరలు పతనం కావడంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. ఆర్థిక సంస్కరణలు, భారీగా నోట్ల ప్రింటింగ్ వంటివి మరిన్ని సమస్యలకే దారితీశాయి. ద్రవ్యోల్బణం చుక్కలనంటింది. తిండి గింజలు కూడా లేక జనం అలమటించారు. దాంతో లక్షలాదిగా పొట్ట చేతపట్టుకుని పొరుగు లాటిన్ అమెరికా దేశాలకు వలసపోయారు.

ఈ క్రమంలో 2014, 2017ల్లో వెనెజువెలా చరిత్రలోనే అతి పెద్ద ఆందోళనలు, నిరసనలు, ప్రదర్శనలు జరిగాయి. వాటన్నింటినీ ఉక్కుపాదంతో అణచేసి మదురో మరింత అప్రతిష్ట మూటగట్టుకున్నారు. నిరసనలన్న మాటే వినిపించకుండా లక్షలాది మందిని జైళ్లలో కుక్కేశారు. రాజకీయ ప్రత్యర్థులను తీవ్రాతి తీవ్రంగా హింసించారు. మానవ హక్కుల హననానికి దేశాన్ని మారుపేరుగా మార్చేశారు. ఇవన్నీ చాలవన్నట్టు 2020లో అమెరికా మదురోను అవినీతి ఆరోపణల్లో దోషిగా తేల్చింది. ఇన్ని ప్రతికూలతల మధ్యే 2024 ఎన్నికల్లో కిందామీదా పడి వరుసగా మూడోసారి అధ్యక్షునిగా ఎన్నికయ్యారాయన.

కానీ ఆ క్రమంలో కనీవినీ ఎరగని అక్రమాలకు పాల్పడి అభాసుపాలయ్యారు. ప్రత్యర్థి ఎడ్మండో గొంజాలెజ్‌కు చాలాచోట్ల ఏకంగా 85 శాతం కంటే ఎక్కువ ఓట్లు పోలైనట్టు తేలినా మదురో మాత్రం తానే గెలిచానని ప్రకటించుకున్నారు. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి వేటాడే ప్రయత్నం చేశారు. దాంతో గొంజాలెజ్‌తో పాటు జనాదరణ ఉన్న విపక్ష నేత మరియా కొరీనా మచాడో వంటివారు అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. 2018లో సైనిక పరేడ్‌లో ప్రసంగిస్తుండగా డ్రోన్ల సాయంతో జరిగిన హత్యాయత్నం నుంచి త్రుటిలో బయటపడ్డారు. చివరికి ఓ పెద్ద దేశాధ్యక్షుడెవరూ ఇప్పటిదాకా ఎదుర్కొని దయనీయ పరిస్థితుల్లో అమెరికా సైన్యానికి భార్యాసమేతంగా పట్టుబడి నిస్సహాయునిగా దేశం వీడారు.

**భర్తకు చేదోడువాదోడుగా...**

సిలియా ఫ్లోరెస్. అప్రతిష్ఠాకర రీతిలో అమెరికాకు పట్టుబడ్డ వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురో భార్య. రాజకీయాల్లో భర్త అడుగుజాడల్లోనే నడిచారామె. మదురో మాదిరిగానే ఆమెదీ అతి సాధారణ నేపథ్యమే. వాయవ్య వెనెజువెలాలో టినాక్విలో అనే చిన్న పట్టణంలో 1956లో ఒక పేద కుటుంబంలో పుట్టారు ఫ్లోరెస్. జరుగుబాటు కోసం ఆమె కుటుంబం కరాకస్‌కు మారింది. అక్కడే ఆమె న్యాయ పట్టా పుచ్చుకున్నారు. పోలీస్ స్టేషన్లో పార్ట్‌టైం జాబ్ చేసే క్రమంలో ఓ డిటెక్టివ్‌ను పెళ్లాడి ముగ్గురు పిల్లల్ని కన్నారు. మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ వ్యక్తిగత లాయర్‌గా మారడం ఆమె జీవితంలో కీలక మలుపు.

అక్కడినుంచీ రాజకీయంగా క్రమంగా ఒక్కో మెట్టూ ఎక్కారు. 2000లో తొలిసారి నేషనల్ అసెంబ్లీకి ఎన్నికైన ఫ్లోరెస్, 2007కల్లా దాని ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. ఆ క్రమంలో మదురోతో జరిగిన పరిచయం కాస్తా ప్రణయంగా మారింది. రెండు దశాబ్దాల సన్నిహిత జీవితం అనంతరం 2013లో ఇద్దరూ తమ జీవిత భాగస్వాములకు విడాకులిచ్చి ఒకటయ్యారు. మదురో అధ్యక్షుడయ్యాక ఆయన నిర్ణయాలన్నింట్లోనూ ఫ్లోరెస్ కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నారు. నేషనల్ అసెంబ్లీ డిప్యూటీ చీఫ్‌గా బలమైన అధికార కేంద్రంగా వ్యవహరించారు.



# వారణాసి టీజర్
## తొలి భారతీయ చిత్రంగా రికార్డ్

మహేష్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం వారణాసి.. యాక్షన్ అడ్వెంచరస్‌గా రానున్న ఈ మూవీపై ఇండియన్ సినిమా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో టీజర్ విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో #GlobeTrotterevent టైటిల్ వీడియోను విడుదల చేశారు. ఈ మూవీ కథా నేపథ్యాన్ని తెలిపేలా ఉన్న ఆ వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయింది.

### జనవరి 5న పారిస్‌లో టీజర్

వారణాసి నుంచి వచ్చిన తాజా అప్‌డేట్ ఏమిటంటే..., అభిమానులను ఆశ్చర్యపరుస్తూ ఈ మూవీ టీజర్ ప్రకటన వచ్చేసింది. ఈ సినిమా టీజర్ ఇప్పుడు చరిత్ర సృష్టించనుంది. పారిస్(Paris)లోని 'లే గ్రాండ్ రెక్స్'(Grand Rex)లో ఈ టీజర్‌ను విడుదల చేయనున్నారు. 2,702 సీట్లు కలిగిన ఈ థియేటర్.. యూరప్‌లోనే అతిపెద్దదిగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై టీజర్‌ను ప్రదర్శించిన తొలి భారతీయ చిత్రంగా మహేష్ బాబు వారణాసి చిత్రం నిలుస్తుంది. జనవరి 5 రాత్రి 9 గంటలకు టీజర్ విడుదల కానుంది.

భారతీయ సినిమాల ఫ్రెంచ్ పంపిణీదారు అన్న ఫిల్మ్స్ ఈ వార్తను ధృవీకరించింది. టీజర్‌ను పెద్ద స్క్రీన్‌పై గొప్ప ఫార్మాట్‌లో ప్రదర్శించడంతుందని ఇది ప్రేక్షకులను మరింతగా ఆకర్షిస్తుందని వారు భావిస్తున్నారు. వారణాసిని ప్రపంచ వార్తల్లో ఉంచడానికి రాజమౌళి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ మూవీని మార్చి 2027లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ, షోయింగ్ బిజినెస్‌కు చెందిన ఎస్.ఎస్. కార్తికేయతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కనిపించనున్నారు. స్వరకర్త ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూర్చగా.. కథ స్క్రీన్‌ప్లేను విజయేంద్ర ప్రసాద్ రాశారు.



# పెళ్లిపై తీసిన కామెడీ సినిమా.. ఓటీటీలోకి ఎప్పుడంటే?

తెలుగులో కొన్నేళ్ల క్రితం వరకు స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్.. బాలీవుడ్ షిఫ్ట్ అయిపోయిన తర్వాత అడపాదడపా మూవీస్ చేసింది. కాకపోతే హిట్స్ దక్కలేదు. ఆరేళ్ల క్రితం వచ్చిన ఓ హిట్ మూవీ సీక్వెల్‌తో గతేడాది చివరలో వచ్చింది. అంతంత మాత్రంగానే ఆడిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఇంతకీ ఏంటా సినిమా? ఎందులోకి రానుంది? అజయ్ దేవగణ్, రకుల్ ప్రీత్ సింగ్ హీరోహీరోయిన్లుగా రొమాంటిక్ కామెడీ సినిమా 'దే దే ప్యార్ దే'. 2019లో వచ్చిన ఈ చిత్రం అప్పట్లో అద్భుతమైన హిట్‌గా నిలిచింది. మళ్లీ గతేడాది నవంబరు 21న దీని సీక్వెల్‌ని థియేటర్లలో రిలీజ్ చేశారు. ఇప్పుడీ మూవీని నెట్‌ఫ్లిక్స్‌లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ శుక్రవారం (జనవరి 09) నుంచే హిందీలో మాత్రమే అందుబాటులోకి రానుంది.

'దే దే ప్యార్ దే 2' విషయానికొస్తే.. తొలి పార్ట్‌లో తనకంటే వయసులో చిన్నదైన ఆయేషాని(రకుల్ ప్రీత్ సింగ్) ప్రేమపెళ్లి చేసుకోవాలనుకున్న ఆశిష్(అజయ్ దేవగణ్).. తన మాజీ భార్య(టబు) అనుమతితో పాటు ఆమె కుటుంబ అంగీకారాన్ని పొందేందుకు ప్రయత్నిస్తాడు. రెండో పార్ట్‌లో రకుల్ తల్లిదండ్రులైన రాజీ ఖురానా(మాధవన్), అంజు ఖురానా(గౌతమి కపూర్).. ఆశిష్‌తో ఈమె పెళ్లికి అడ్డంకిగా నిలుస్తారు. తనకంటే ఏడాది పెద్దవాడైన ఆశిష్‌తో తన కూతురికి రాజ్ పెళ్లి చేశాడా లేదా? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ. ఇకపోతే ఈ వీకెండ్ ఓటీటీల్లోకి వచ్చిన సినిమాల విషయానికొస్తే.. ఎకో, 120 బహదూర్, డ్రైవ్, బ్యూటీ, హక్ లాంటి తెలుగ్ స్ట్రెయిట్, డబ్బింగ్ చిత్రాలతో పాటు స్ట్రేంజర్ థింగ్స్ ఫినాలే ఎపిసోడ్, ఎల్‌బీడబ్ల్యూ సిరీస్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి.




## మన శంకర వరప్రసాద్‌గారు ట్రైలర్..
# ఫుల్ యాక్షన్ మోడ్‌లో చిరు

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్‌గారు' ట్రైలర్ వచ్చేసింది. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ మూవీలో వెంకటేశ్‌ముఖ్యమైన పాత్రలో నటించారు. నయనతార హీరోయిన్. ఈ సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే వచ్చిన సాంగ్స్, పోస్టర్స్ ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పటి వరకూ చూడని సరికొత్త చిరంజీవిని ఈ చిత్రంలో చూడబోతున్నారంటూ అనిల్ రావిపూడి చెప్పడంతో అభిమానుల్లో భారీ అంచనాలు పెరిగాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను మెప్పించేలా ఉంది. తనదైన మార్క్‌తో ఈ ట్రైలర్‌ను అనిల్ కట్ చేశారు. కామెడీ పంచ్‌లతో పాటు చిరంజీవి మెరుపులు కూడా చూడొచ్చు. కేవలం కామెడీ మాత్రమే కాకుండా చిరును ఫుల్ యాక్షన్ మోడ్‌లో కూడా చూపించినట్లు తెలుస్తోంది.




# రెబెకా వచ్చేశారు

'కేజీఎఫ్, కేజీఎఫ్ 2' వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత యష్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. కియారా అద్వానీ, నయన తార, హూమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్పై వెంకట్ కె.నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, కన్నడ భాషల్లో నేరుగా, హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో డబ్బింగ్ వెర్షన్‌ని మార్చి 19న రిలీజ్ చేస్తున్నారు.

ఇప్పటికే ఈ సినిమా నుంచి నాడియా పాత్రలో నటిస్తోన్న కియారా అద్వానీ, గంగ పాత్ర చేస్తున్న నయనతార, హూమా ఖురేషి నటిస్తున్న ఎలిజిబెత్ పాత్రలకు సంబంధించిన లుక్స్‌ని విడుదల చేశారు.

తాజాగా తారా సుతారియా చేస్తున్న రెబెకా పాత్రను పరిచయం చేశారు మేకర్స్. ఈ సందర్భంగా గీతూ మోహన్ దాస్ మాట్లాడుతూ—"తారా సుతారియా నటిస్తున్న తొలి పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'. ఆమె కెరీర్‌లో ఇదొక కొత్త అధ్యాయం. తను ప్రతి విషయాన్ని సునిశితంగా గమనించేది. రెబెకా పాత్రలో తను జీవించింది. తన నటన నన్ను ఎంతో ఆశ్చర్యపరిచింది. సినిమా విడుదల తర్వాత ప్రేక్షకులనూ ఆశ్చర్యపరుస్తుందనటంలో సందేహం లేదు" అని చెప్పారు.



# భలే చాన్స్

ప్రముఖ నటుడు రజనీకాంత్‌ని డైరెక్ట్ చేసే భలే చాన్స్ అందుకున్నారు యువ దర్శకుడు శిబి చక్రవర్తి. రజనీకాంత్ నటించనున్న 173వ చిత్రం గురించి ఇటీవల పలు వార్తలు ప్రచారం అయిన విషయం తెలిసిందే. నటుడు కమల్‌హాసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించనున్నారు. ఈ మూవీకి సుందర్. సి దర్శకత్వం వహించనున్నట్లు తొలుత ప్రకటన వెలువడింది. కమల్‌హాసన్, రజనీకాంత్‌తో సుందర్.సి కలిసి ఉన్న ఫోటోలను కూడా రిలీజ్ చేశారు. అయితే ఈ చిత్రం నుంచి సందర్ వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత ఈ మూవీకి 'డ్రాగన్' ఫేమ్ అశ్వద్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నట్లు ప్రచారం జరిగింది. కాగా ఇప్పుడు శిబి చక్రవర్తి తెరపైకి వచ్చారు. శివ కార్తికేయన్ హీరోగా 'డాక్టర్, డాన్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారాయన. నిజానికి ఇంతకుముందే రజనీ కోసం ఓ మంచి కథను సిద్ధం చేశారు దర్శకుడు. కాగా రజనీకాంత్ చిత్రానికి శిబి చక్రవర్తి దర్శకత్వం వహించనున్నట్లు కమల్‌హాసన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాని 2027 పొంగల్‌కి విడుదల చేస్తామని కమల్ పేర్కొన్నారు

# సిరీస్‌గా ఐదు షాకింగ్ ఘటనలు..




గత కొన్నేళ్ల కాలంలో భర్తల్ని భార్యలు రకరకాలుగా చంపుతూ వార్తల్లో నిలుస్తున్నారు. ఓ మహిళ.. తన భర్త శరీరాన్ని ముక్కలుగా చేసి డ్రమ్‌లో దాచిపెడితే, మరో భార్య హనీమూన్‌కి తీసుకెళ్లి భర్తని చంపించింది. ఈ వార్తలని మీరు చూడటమో చదవడమో చేసే ఉంటారు. ఇప్పుడు ఈ సంఘటనలపై ఏకంగా వెబ్ సిరీస్ తీశారు. దాన్ని స్ట్రీమింగ్‌కి సిద్ధం చేశారు. ఇంతకీ ఇది ఎప్పుడు ఏ ఓటీటీలోకి రానుంది?

భర్తల్ని భార్యలు హ*త్య చేయించడం లాంటి సంఘటనలు గతేడాది ఎక్కువగా విన్నాం, చూశాం. అలాంటి ఓ ఐదింటిని తీసుకుని ఇప్పుడు 'హనీమూన్ సే హత్య' పేరుతో ఓ డాక్యుమెంటరీ సిరీస్‌గా తీశారు. జీ5 ఓటీటీలో ఈనెల 9వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుందని ప్రకటించారు. ఇందులో నీలం రంగు డ్రమ్ కేసు, హనీమూన్ కేసుతో పాటు పాటు మరో మూడు కేసుల్ని కూడా చూపించబోతున్నారు.

దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన బ్లూ డ్రమ్ కేసు విషయానికొస్తే.. మర్చంటే నేవీ ఆఫీసర్ సౌరభ్, ముస్కాన్ అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లకు భర్తని కాదనుకున్న ముస్కాన్.. ప్రియుడి సాహిల్‌తో కలిసి సౌరభ్‌ని కిరాతకంగా చంపేసింది. ఆపై శరీర భాగాల్ని నీలం రంగు డ్రమ్‌లో పెట్టి సీల్ చేసింది. తన తండ్రి డ్రమ్‌లో ఉన్నాడని సౌరభ్ కుమార్తె.. ఇరుగు పొరుగువాళ్లకు చెప్పడం వల్లే ఈ ఉదంతం బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఇది చోటుచేసుకుంది. ఈ కేసులో ముస్కాన్, సాహిల్ ప్రస్తుతం జైలు జీవితం అనుభవిస్తున్నారు.

హనీమూన్ హత్య విషయానికొస్తే మధ్యప్రదేశ్ ఇండోర్‌కి చెందిన రాజా రఘువంశీ.. సోనమ్‌ని పెళ్లి చేసుకున్నాడు. హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లారు. తర్వాత వీళ్లిద్దరూ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలోని లోయలో పోలీసులు గుర్తించారు. శరీరంపై కత్తిగాయాలు ఉండటంతో హత్య అని అనుమానించారు. భార్య సోనమ్ కోసం గాలించగా.. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి భర్తని హత్య చేయించినట్లు ఒప్పుకొంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com